

భెల్ హెచ్‌పీవీపీ కార్మికులకు రూ.25 వేలు బోనస్

అక్కిరెడ్డిపాలెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): భెల్ హెచ్‌పీవీపీ కార్మికులకు దీపావళి బోనస్‌ను అందించేందుకు యాజమాన్యం అంగీకరించినట్టు గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్.సాహు, నాయకులు కొల్లి దేముడు, బి.బాబూరావు, పీవీఎస్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఢిల్లీలో జాతీయ కార్మిక సంఘాల నాయకులతో యాజమాన్యం జరిపిన చర్చల్లో ఈ నిర్ణయం తీసుకున్నట్టు వారు పేర్కొన్నారు. ఈ నెల 28న ఒక్కో కార్మికునికి రూ.25 వేల చొప్పున బోనస్‌ను యాజమాన్యం అందించనున్నదని వారు ఆనందం వ్యక్తం చేశారు.

క్లాప్ కథేంటి?

పనితీరుపై దృష్టిసారించిన జీవీఎంసీ కమిషనర్

- ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించేందుకు సచివాలయానికొకటి చొప్పున 578 వాహనాలు కేటాయించిన నగర పాలక సంస్థ
- నెలకు ఒక్కో వాహనానికి రూ.68 వేల వరకూ చెల్లిస్తున్న జీవీఎంసీ
- రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా నెరవేరని లక్ష్యం
- చెత్త సేకరించడంలో సిబ్బంది నిర్లక్ష్యం
- వారానికి రెండు, మూడు రోజులే చెత్తసేకరణ
- ఇంట్లో చెత్తను రోడ్లపైకి తెచ్చి పడేస్తున్న ప్రజలు
- వాహనాలను గాడిలో పెట్టాలని కమిషనర్ నిర్ణయం
- అన్నీ బాగుంటేనే ఇకపై బిల్లు చెల్లింపు



క్లాప్ వాహనం (ఫైల్ ఫొటో)

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించేందుకు ఏర్పాటుచేసిన క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) వాహనాల పనితీరు మెరుపరచడంపై జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ దృష్టిసారించారు. ఒక క్లాప్ వాహనం వార్డు సచివాలయ పరిధిలో గల ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించాల్సి ఉంది. అయితే సిబ్బంది రోజుకు ఒక ప్రాంతంలోని ఇళ్ల నుంచి మాత్రమే చెత్త సేకరిస్తున్నట్టు ఫిర్యాదులు అందుతున్నాయి. దీంతో మిగిలిన ప్రాంతాల్లోని ప్రజలు తమ ఇళ్లలో చెత్తను రోడ్డుపైకి తెచ్చి పడేస్తున్నారు. ఇది నగరంలో పారిశుధ్య లోపానికి దారితీస్తుండడంతో క్లాప్ వాహనాలు పక్కాగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ కిందిస్థాయి అధికారులను ఆదేశించారు.

ఇళ్ల నుంచి రోజూ చెత్త సేకరించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు జీవీఎంసీ క్లాప్ వాహనాలను ఒక ప్రైవేటు కాంట్రాక్టర్ ద్వారా ఏర్పాటుచేసుకుంది. వార్డు సచివాలయానికొకటి చొప్పున జీవీఎంసీ పరిధిలోని 578 వార్డు సచివాలయాలకు 578 వాహనాలను కేటాయించారు. ఒక్కో వాహనానికి నెలకు రూ.64 వేలు చొప్పున కాంట్రాక్టర్‌కు జీవీఎంసీ చెల్లిస్తోంది. ఈ మొత్తాన్ని గత ప్రభుత్వం ప్రజల నుంచి యూజర్ చార్జీల రూపంలో వసూలుచేసేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యూజర్ చార్జీలను రద్దు చేసింది. క్లాప్ వాహనాల అద్దెను జీవీఎంసీయే చెల్లించాలంటూ రాష్ట్ర మునిసిపల్ శాఖ డైరెక్టర్ కార్యాలయం ఆదేశించింది. ఈ నేపథ్యంలో క్లాప్ వాహనాల పనితీరుపై ప్రజారోగ్య విభాగం, మెకానికల్ విభాగం అధికారులతో జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఇటీవల సమీక్ష నిర్వహించారు. క్లాప్ వాహనాలు రోజుకు ఎన్ని ట్రిప్పులు తిరుగుతున్నాయి, ఒక్కో ట్రిప్పులో ఎంత బరువు చెత్తను సంబంధిత జోన్‌లోని గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌కు తీసుకువెళుతున్నాయి, వాటికి సంబంధించిన జీపీఎస్ వివరాలను పరిశీలించారు. వాహనాల పనితీరు సక్రమంగా లేదని గుర్తించారు. క్లాప్ వాహనాలు ప్రతిరోజూ తమకు ... మిగతా 6వ పేజీలో



అక్కయ్యపాలెం రామచంద్రనగర్ వద్ద చెత్తతో నిండిపోయిన డంపర్ బిన్

రోడ్ల నిర్వహణకు గ్లోబల్ టెండర్లు?

నగరంలో రహదారులను మెరుగుపరిచే దిశగా చర్యలు

- పెద్ద సంస్థలకు కాంట్రాక్టు ఇవ్వాలని జీవీఎంసీ కమిషనర్ యోచన
- ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశం
- ఆసక్తి వ్యక్తీకరణ, ఆర్‌ఎఫ్‌పీలకు ఆహ్వానం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)



తెన్నేటి పార్కు వద్ద అస్తవ్యస్తంగా రోడ్డు

నగరంలోని రహదారులను అత్యంత పటిష్ఠంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ నిర్ణయించారు. ప్రస్తుతం ఏటా సుమారు రూ.100 కోట్లు ఖర్చు చేస్తున్నా ఆశించిన ఫలితం కనిపించకపోవడంతో ఇకపై పెద్దపెద్ద సంస్థలకు కాంట్రాక్టు ఇవ్వాలనే యోచనలో ఉన్నట్టు తెలిసింది. ఇందుకోసం గ్లోబల్ టెండర్లు పిలవాలని నిర్ణయించినట్టు సమాచారం.

నగరంలో ముఖ్యమైన రోడ్ల నిర్వహణ పనులను ఇకపై గ్లోబల్ టెండర్ల ద్వారా పెద్ద సంస్థలకు అప్పగించాలని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ నిర్ణయించినట్టు తెలిసింది. సుమారు 30 అడుగులు, అంతకంటే ఎక్కువ వెడల్పున్న రోడ్ల నిర్వహణ, పాడైపోయిన రోడ్లపై కొత్తగా తారు లేయర్ వేసేందుకు జీవీఎంసీ ఏటా రూ.వంద కోట్లు వరకూ వెచ్చిస్తోంది. ఆయా పనులు స్ట్రెచ్‌ల వారీగా టెండర్లు పిలిచి, తక్కువ మొత్తం కోట్ చేసిన కాంట్రాక్టర్‌కు అప్పగిస్తోంది. అయితే కొందరు కాంట్రాక్టర్లకు సొంతంగా యంత్రాలు లేకపోవడం, ఒక్కొక్కరు ఒక్కో రకం యంత్రాన్ని అద్దెకు తీసుకువస్తుండడంతో రోడ్ల నిర్మాణంలో ఏకరూపత కనిపించడం లేదు. దీంతోపాటు రోడ్ల అంచుల్లో (ఎడ్జ్) రోలింగ్ సరిగా చేయకపోవడంతో త్వరగా పాడైపోతున్నాయి. అంతేకాకుండా రోడ్డు నిర్మించిన తర్వాత కాంట్రాక్టర్ కొంతకాలం నిర్వహణ బాధ్యతలను చూడాల్సి ఉన్నా, పట్టించుకోవడం లేదు. వీటన్నింటినీ పర్యవేక్షించాల్సిన ఇంజనీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు మారిపోతుండడంతో కాంట్రాక్టర్లను ప్రశ్నించేవారే లేకపోతున్నారు.

పెద్ద సంస్థలతో మేలు

ఈ సమస్యలన్నింటినీ గుర్తించిన కమిషనర్ నగరంలో 30 అడుగులు, అంతకంటే ఎక్కువ వెడల్పున్న రోడ్ల మరమ్మతులు, కొత్తలేయర్ల నిర్మాణం కోసం రెండేళ్ల కాలవ్యవధితో ఎల్అండ్‌టీ, ఎన్‌సీసీ వంటి పెద్ద సంస్థలకు అప్పగించేందుకు గ్లోబల్ టెండర్లు పిలవాలని నిర్ణయించినట్టు తెలిసింది. వచ్చే రెండేళ్లలో చేపట్టాల్సిన రోడ్ల ... మిగతా 6వ పేజీలో

న్యూస్ బాక్స్

నేడు ఇన్‌చార్జి మంత్రి డోలా రాక

విశాఖపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి):



జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి గురువారం నగరానికి రానున్నారు. రాత్రి విజయవాడ నుంచి వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి 11.35 గంటలకు విశాఖ చేరుకుంటారు. సర్క్యూట్ హౌస్‌లో బస చేస్తారు. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి వెళ్లి అక్కడ నాయకులు, కార్యకర్తలను కలుసుకుంటారు. తిరిగి 1.30 గంటలకు సర్క్యూట్ హౌస్‌కు చేరుకుంటారు. కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని 3.00 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకుని జిల్లాలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమావేశమవుతారు. అనంతరం రాత్రి 10 గంటలకు రైల్వేస్టేషన్‌కు చేరుకుని విజయవాడ వెళతారు.

భారత్-ఎ జట్టులో ఇద్దరు నగర క్రికెటర్లు

- ఆస్ట్రేలియా పర్యటనకు రికీ భుయ్, నిశాంత్‌కుమార్‌రెడ్డి ఎంపిక



నిశాంత్‌కుమార్‌రెడ్డి రిక్కీ

విశాఖపట్నం (స్పోర్ట్సు), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి):

ఆస్ట్రేలియాలో పర్యటించనున్న భారత్-ఎ జట్టులో నగరానికి చెందిన యువ క్రికెటర్లు రికీ భుయ్, నిశాంత్‌కుమార్‌రెడ్డిలకు చోటు దక్కింది. సెలక్షన్ కమిటీ బుధవారం ప్రకటించిన 15 మంది సభ్యులతో కూడిన జట్టులో ఆంధ్ర నుంచి రికీ భుయ్, నిశాంత్‌కుమార్‌రెడ్డి స్థానం దక్కించుకున్నారు. ఈ పర్యటనలో భారత్-ఎ జట్టు ఆస్ట్రేలియా-ఎతో రెండు ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడనున్నది. భారత్-ఎ జట్టుకు ఎంపికైన రికీ, నిశాంత్ కుమార్‌రెడ్డిలకు ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) కార్యదర్శి సానా సతీష్‌బాబు అభినందనలు తెలిపారు.

రూ.4.34 కోట్ల విదేశీ సిగరెట్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న సిగరెట్లను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

మాధవధార, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి):

నగరంలోని మాధవధార ఉడా కాలనీలో అనధికారికంగా నిల్వ ఉంచిన విదేశీ సిగరెట్లను బుధవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాంతీయ అధికారులు పట్టుకున్నారు. వీటి విలువ రూ.4,34,20,920 ఉంటుందని తెలిపారు. చౌడువాడ వరహాలనాయుడు ఉడా కాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని బిల్లులు లేకుండా వ్యాపారం చేస్తున్నట్టు సమాచారం అందడంతో నిఘా పెట్టామన్నారు. బుధవారం దాడులు చేసి గుర్తించిన సిగరెట్లలో పలు విదేశీ బ్రాండ్లు ఉన్నాయని విజిలెన్స్ ప్రాంతీయ అధికారి కె.శ్రీనివాసులు తెలిపారు. నిల్వలపై రాష్ట్ర జీఎస్టీ అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. బిహార్‌లోని అంకిత్ కెమికల్స్ నుంచి సిగరెట్లను నగరానికి తీసుకొచ్చినట్టు వివరించారు.

శారదా పీఠానికి షాక్

కొత్తవలసలో భూ కేటాయింపు రద్దు

- వందల కోట్ల రూపాయల విలువైన భూమిని రూ.15 లక్షలకు ఇచ్చేసిన వైసీపీ ప్రభుత్వం
- ఆధ్యాత్మిక కార్యక్రమాల కోసం తీసుకుని హోటల్ నిర్మాణానికి ప్లాన్



శారదాపీఠానికి వైసీపీ ప్రభుత్వం కేటాయించిన భూమి

విశాఖపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి):

శారదా పీఠానికి రాష్ట్ర ప్రభుత్వం గట్టి షాక్ ఇచ్చింది. భీమునిపట్నం మండలం కొత్తవలసలో గత ప్రభుత్వం జరిపిన భూ కేటాయింపులను రద్దు చేస్తూ బుధవారం రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. విశాఖపట్నం-భీమునిపట్నం బీచ్ రోడ్డులో కొత్తవలస వద్ద సుమారు రూ.225 కోట్ల విలువైన 15 ఎకరాల భూమిని శారదా పీఠానికి కేవలం రూ.15 లక్షలకు (ఎకరా రూ.లక్షకు) జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం కట్టబెట్టింది. అక్కడ ఎకరా రిజిస్ట్రేషన్ విలువే రూ.2 కోట్లు వరకూ ఉందని జిల్లా యంత్రాంగం చెప్పినా రాష్ట్ర ప్రభుత్వం చెవికెక్కించుకోలేదు. అంతేగాకుండా పీఠానికి కొండపై కేటాయించిన భూమికి వీఎంఆర్‌డీఏ రెండు కోట్ల రూపాయలతో రహదారి నిర్మాణం చేపట్టింది. ఇదిలావుండగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు విస్తరించడంతోపాటు వేద పాఠశాల నిర్వహణ ఏర్పాటుచేస్తామని చెప్పి భూమి తీసుకున్న పీఠం...దానిని వాణిజ్య అవసరాలకు వినియోగించుకుంటామని అప్పటి పాలకులకు కోరగా వెంటనే గ్రీన్‌సిగ్నల్ వచ్చేసింది. అక్కడ ఎనిమిది అంతస్థులతో బోర్డింగ్ హౌస్ పేరుతో హోటల్ నిర్మాణానికి గుట్టుచప్పుడు కాకుండా జీవో ఇచ్చేసింది. శారదా పీఠం పేరున కాకుండా ఉత్తరాధికారి పేరిట భూమిని బదలాయించిన విషయం వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారంపై జిల్లా యంత్రాంగం నుంచి ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఇటీవల నివేదిక తెప్పించుకుంది. దానిని పరిశీలించిన అనంతరం చివరకు భూ కేటాయింపు రద్దు చేయాలని నిర్ణయం తీసుకుంది. ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలని జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు రానున్నాయి.

కానరాని సమస్యల పరిష్కారం

- నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

- అసలు అధికారులు పట్టించుకోవడం లేదంటున్న సభ్యులు
- సమావేశం జరిగే తీరు మారాలనే అభిప్రాయం
- జిల్లాలో రహదారుల దుస్థితి, ఇసుక సరఫరా, ఖరీఫ్‌కు నీటి విడుదల వంటి అంశాలపై దృష్టిసారించాలని విజ్ఞప్తి



విశాఖపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి):

జిల్లా పరిషత్ పాలకవర్గం ఏర్పాటై మూడేళ్లు అయ్యింది. మూడు నెలలకొకసారి నిర్వహించే సమావేశాల్లో ప్రస్తావనకు వచ్చే సమస్యలు పరిష్కారం కావడం లేదనే విమర్శలు ఉన్నాయి. జిల్లాలు విడిపోయిన తరువాత మూడు జిల్లాల కలెక్టర్లు, అధికారులు జిల్లా పరిషత్ ... మిగతా 6వ పేజీలో

ఏయూలో పరీక్ష ఫీజు తగ్గింపు

గత పాలకుల హయాంలో భారీగా పెంపు

- విద్యార్థుల వినతి మేరకు తక్షణమే స్పందించి నిర్ణయం తీసుకున్న ప్రస్తుత పాలకులు
- రూ.450 తగ్గిస్తూ ఆదేశాలు జారీ

విశాఖపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి):



విద్యార్థులపై పరీక్ష ఫీజుల భారం తగ్గిస్తూ ఆంధ్ర విశ్వవిద్యాలయం అధికారులు నిర్ణయం తీసుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వర్సిటీని అన్ని విధాలుగా నాశనం చేసిన పాలకులు పరీక్ష ఫీజును కూడా భారీగా పెంచి విద్యార్థులపై ఆర్థిక భారం మోపారు. పెంచిన పరీక్ష ఫీజులను తగ్గించాలని విద్యార్థులు అప్పటి అధికారులను కోరినా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో ఆర్ట్స్, సైన్స్ కాలేజీలకు చెందిన పలువురు విద్యార్థులు బుధవారం ఉదయం వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇ.ఎన్.ధనుంజయరావు, రెక్టార్ కిశోర్‌బాబులను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. దీనిపై వీసీ, రిజిస్ట్రార్, రెక్టార్‌లు ... మిగతా 6వ పేజీలో

సమీక్ష సమావేశం వాయిదా

భీమునిపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణాభివృద్ధిపై ఈనెల 25న ఆనందపురం మండలం పెద్దిపాలెం చెన్నాస్ కన్వెన్షన్‌లో కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధ్యక్షతన జరగాల్సిన నియోజకవర్గ సమీక్ష సమావేశాన్ని భారీ వర్షాల వల్ల వాయిదా వేశామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన క్యాంపు కార్యాలయం అధికారులు ఒక ప్రకటన విడుదల చేశారు. సమావేశం ఎప్పుడు నిర్వహించేది తెలియజేస్తామన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో కనకారావు ప్రతిభ



పతకాలతో కనకారావు

కొమ్మాది, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మధురవాడకు చెందిన పెదిరెడ్డి కనకారావు మార్షల్ ఆర్ట్స్‌లో ప్రపంచ రికార్డు సొంతం చేసుకున్నారు. ప్రపంచంలో ఇప్పటివరకు ఎవరూ చేయలేని విధంగా కేవలం 30 సెకండ్లలో బాక్సింగ్ గ్లౌజులు ఉపయోగించి, 184 పూర్తిస్థాయి పంచ్‌లు సంధించారు.గత ఆగస్టు 13న ఈ సాహసాన్ని ప్రదర్శించగా,అందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్సుకు పంపించగా వారు పరిశీలించి కనకారావు పేరిట రికార్డు నమోదు చేశారు. దానికి సంబంధించిన సర్టిఫికెట్లు, మెడల్, ట్రోఫీ అందించినట్టు బుధవారం ఆయన ఇక్కడి విలేకరులకు తెలిపారు.ప్రపంచ రికార్డు సాధించిన కనకరావును పలువురు అభినందించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

భీమునిపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని ఆ పథకం కోఆర్డినేటర్ శాస్త్రి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు భోజనానికి ముందు తప్పనిసరిగా చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు. అనంతరం భోజనం పదార్థాలను రుచి చూసి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయనతో పాటు ఎంఈఓ జయప్రద, పాఠశాల హెచ్ఎం రమణ, పిడి సతీశ్ ఉన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదుపై అవగాహన

పద్మనాభం రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మద్ది, తునిపొలం, విజయరాంపురం గ్రామాల్లో టీడీపీ సభ్యత్వ నమోదుపై మాజీ ఎంపీపీ కాళ్ల నగేశ్ కుమార్ కార్యకర్తలకు బుధవారం అవగాన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 26 నుంచి సభ్యత్వ నమోదు ప్రారంభమవుతుంన్నారు. క్లస్టర్, యూనిట్ ముఖ్య నాయకులు శత శాతం సభ్యత్వాల నమోదుకు కృషి చేయాలని చెప్పారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సింహాచలం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం తొలిపావంచా వద్ద ఉన్న 11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో అత్యవసర పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 98వ వార్డు పరిధిలోని గోశాల లేఅవుట్, గ్రామీణ ఆరోగ్య కేంద్రం, టివి టవర్ కాలనీ, ప్రియాగార్డెన్స్ ప్రాంతాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని సూచించారు.

మధురవాడ పరిధిలో..

మధురవాడ : మధురవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ చంద్రంపాలెం ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 వరకు సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. చంద్రంపాలెం, మధురవాడ మెయిన్ రోడ్, దుర్గానగర్-1, దుర్గానగర్-2, కృష్ణానగర్, పోర్టు కాలనీ ప్రాంతాలకు సరఫరా ఉండదని చెప్పారు.

తగరపువలస పరిధిలో...

తగరపువలస : చిట్టివలస సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 వరకు సరఫరా ఉండదని అధికారులు తెలిపారు. చిల్లపేట, జీరుపేట, నమ్మివానిపేట, ఎడదాసరిపేట ప్రాంతాలకు సరఫరా నిలుపుదల చేస్తామని చెప్పారు.

వరద బాధితులకు విరాళం

భీమునిపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలోని వరద బాధితులకు ఏపీ సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవాస విద్యాలయాలు, వసతి గృహాల ఉద్యోగుల అసోసియేషన్ రూ 1.10 లక్షల విరాళం ప్రకటించింది. ఈమేరకు బుధవారం మంగళగిరిలో రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌కు అసోసియేషన్ అధ్యక్షుడు రఘుబాబు, కార్యదర్శి మంగపతిరావు, ఉపాధ్యక్షుడు ఎం. రాజబాబు, తదితరులు అందజేశారు.

అయ్యప్ప దీక్షలు ప్రారంభం

పద్మనాభం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మద్ది ధర్మశాస్తా పీఠంలో అయ్యప్ప మాలాధారణ బుధవారం ఘనంగా నిర్వహించారు. పీఠంలో అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గురుస్వామి సామవేదం బదరికా వాసు పలువురికి మాలాధారణ చేశారు.ఈనెల 23 నుంచి డిసెంబరు 3 వరకు దీక్షాధారులకు మహానారాయణ సేవ నిర్వహించనున్నట్టు ఎంపీపీ, రాంబాబు తెలిపారు.

రెవెన్యూ సేవల్లో తాత్సారం చేయొద్దు

- ప్రజలతో స్నేహభావంతో ఉండాలి
- తప్పు చేస్తే చర్యలు తప్పవు
- కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ఆనందపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ అధికారులు, సిబ్బంది ప్రజలను తమ కుటుంబ సభ్యుల్లా భావించి, వారితో స్నేహ పూర్వకంగా ఉండాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ప్రభుత్వ సూచనలు ప్రకారం పనిచేయాలని, ఎవరూ ఒత్తిళ్లకు లొంగిపోకుండా నిజాయితీగా ఉండాలని చెప్పారు. బుధవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో భీమిలి రెవెన్యూ డివిజన్ కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పించుకోకుండా, నిబంధనల మేరకు సేవలందించాలని సూచించారు. క్షేత్రస్థాయి పరిస్థితులపై పూర్తిగా అవగాహన పెంచుకుని విధులు నిర్వర్తించాలని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రికార్డుల నిర్వహణ పక్కాగా చేపట్టాలని చెప్పారు. భూములకు సంబంధించిన సమస్యలు లేకుండా ఉంటే భవిష్యత్‌లో పారిశ్రామికవేత్తలు, ఐటీ పరిశ్రమల నిర్వాహకులు ఇక్కడికి వచ్చేందుకు ఆసక్తి చూపిస్తారన్నారు. కార్యాలయాలకు వచ్చే ప్రజలకు సులభతరమైన రీతిలో సేవలందించాలని సూచించారు. తప్పు చేసినా.. చూసి ఊరుకున్నా..ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కుల,ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాల జారీ, పట్టాదారు పాసు పుస్తకాల జారీలో అక్రమాలకు పాల్పడరాదని, అలా ఎవరైనా చేస్తే చర్యలు తప్పవని చెప్పారు. అనంతరం రీసర్వే, మ్యూటేషన్ ప్రక్రియ, వివిధ సర్టిఫికెట్ల జారీ, భూముల ఫ్రీహోల్డు, ప్రభుత్వ భూముల పరిరక్షణ, రెవెన్యూ రికార్డుల నిర్వహణ, డి. నోటిఫికేషన్, ప్రజా సమస్యలపై స్పందన, క్షేత్రస్థాయి రెవెన్యూ సమస్యలపై చర్చించారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్, భీమిలి ఆర్‌డీఓ సంగీత్ మాథుర్, ఉప కలెక్టర్లు, సర్వే విభాగం ఏడీ, కలెక్టరేట్ ఏవో, ల్యాండ్ సెక్షన్ అధికారులు, తహసీల్దార్లు, డిటిలు పాల్గొన్నారు.



ఎంపీ శ్రీభరత్‌ను కలిసి వినతిపత్రం అందిస్తున్న భూ బాధితుల ప్రతినిధులు

పరిష్కారం దిశగా 'పంచ గ్రామాల' సమస్య

- ప్రజాప్రతినిధులకు వినతులు అందజేస్తున్న బాధితులు
- సానుకూల ప్రకటనలతో ఆశలు

సింహాచలం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : పంచ గ్రామాల భూవివాదం త్వరలో పరిష్కారమవుతుందన్న ఆశతో బాధితులు ఉన్నారు. కూటమి నాయకులు గత ఎన్నికల్లో పంచ గ్రామాల భూ వివాదాన్ని ప్రధాన అజెండాగా చేర్చారు. ఈమేరకు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఎన్నికల్లో గెలిచిన పదిహేను రోజుల్లోనే విషయాన్ని తమ పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌తోనూ, ముఖ్యమంత్రి చంద్రబాబుతోనూ చర్చించి పరిష్కరించాలని కోరారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కూడా సీఎం, మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాల్సిన ఆవశ్యకతను వివరించారు. అలాగే తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు కూడా ఇదే సమస్యపై పాలకులపై వత్తిడి పెంచారు. ఈమేరకు ఈనెల 25న కలెక్టర్ అధ్యక్షతన పరిష్కారానికి గల మార్గాలను అన్వేషించే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. హైకోర్టులో వచ్చే నెల 6న ఈ కేసు విచారణకు రానుండడంతో అడ్వకేట్ జనరల్‌పై కూడా కూటమి ప్రజాప్రతినిధులు వత్తిడి చేస్తున్నారు.కాగా ఈ సమస్యపై ప్రజా రైతు సంక్షేమ సంఘం వారం రోజులుగా ప్రతినిధులను కలిసి వినతి పత్రాలు అందజేసి సమస్యను పరిష్కరించాలంటూ కోరుతున్నది. బుధవారం వారు ఎంపీ శ్రీభరత్‌ను కలిసి వినతిపత్రం అందించారు. దీనిపై ఎంపీ మాట్లాడుతూ అతి త్వరలోనే సమస్య పరిష్కారమవుతుందన్నారు.



ఆక్రమణలను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు, పోలీసులు

ఎల్‌వీపాలెంలో ఆక్రమణలు తొలగింపు

ఆనందపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎల్‌వీ పాలెం పంచాయతీ జట్టమ్మ కొండపై ప్రభుత్వానికి చెందిన నలభై సెంట్లు భూమిని రెవెన్యూ అధికారులు ఆక్రమణదారుల నుంచి బుధవారం స్వాధీనం చేసుకున్నారు. సర్వే నెంబరు 276లో 40 సెంట్లు భూమిని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు కేటాయించారు. ఈ స్థలంలో అదే గ్రామానికి చెందిన కంచుబోయిన శ్రీను, కంచుబోయిన నరసింగరావు భూహక్కు సంరక్షణ పేరు మీద వ్యవస్థీకృత విధానం ద్వారా ఆక్రమణకు పాల్పడ్డారు. ఈ విషయమై అం దిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన రెవెన్యూ అధికారులు వారిని ఆక్రమణలు తొలగించమని రెండు నెలల క్రితం నోటీసులు జారీ చేయగా ఎటువంటి సమాధానం లేదు. దీంతో నోటీసు 6 జారీ చేయడంతో పాటు ఇంటి వద్ద నోటీసు అంటించారు. ఆక్రమణదారులు స్పందించకపోగా అధికారులపై తప్పుడు ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు పోలీసుల సహాయంతో తహసీల్దార్ శ్యామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో అధికారులు ఆక్రమణలో ఉన్న షెడ్లను తొలగించి, స్థలాన్ని స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

నేటి నుంచి 'ఉక్కు'లో బాణసంచా విక్రయాలు

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ కో-ఆపరేటివ్ స్టోర్స్ ఆధ్వర్యంలో గురువారం నుంచి బాణసంచా విక్రయాలు ప్రారంభిస్తున్నట్టు స్టోర్స్ అధ్యక్షుడు డీవీ నాగబాబు,కార్యదర్శి ఆకుల నూకరాజు తెలిపారు. స్టోర్స్ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటులో ప్రస్తుత ఆర్థిక స్థితిని అయ్యాన్స్ సంస్థకు వివరించడంతో గత ఏడాది కంటే ఈసారి తక్కువ ధరకు బాణసంచాను సరఫరా చేశారన్నారు. సీడబ్ల్యూసీ-1లో రోజూ ఉదయం 9 నుంచి రాత్రి 8.30 గంటల వరకు బాణసంచా విక్రయిస్తామని, ఉక్కు ఉద్యోగుల కోసం ఏడు కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో వారితో పాటు ఉపా ధ్యక్షుడు జి.నాగభూషణం, డైరెక్టర్లు బీటీ జగదీశ్, ఏవీ జగదీశ్వరరావు, ఏవీ సత్యనారాయణ, లోకేశ్, భాను, తదితరులు పాల్గొన్నారు.

కానరాని సమస్యల పరిష్కారం

... 5వ పేజీ తరువాయి

సమావేశానికి హాజరవుతున్నారు. ప్రతి సమావేశంలో ఐదారు శాఖలపై గంటలకొద్దీ సమీక్షలు నిర్వహిస్తున్నారు. కానీ ప్రయోజనం మాత్రం ఉండడం లేదనే వ్యాఖ్యలు సభ్యుల నుంచి వినిపిస్తున్నాయి. వ్యవసాయం, విద్య, వైద్యం, డ్వామా, పంచాయతీరాజ్, హౌసింగ్, డీఆర్‌డీఏ, పౌరసరఫరాలు, పశు సంవర్థక, గనులు, రవాణా వంటి శాఖలు తప్ప కొన్ని శాఖలపై ఇప్పటివరకూ అసలు చర్చే చేపట్టలేదు. ఒకటి, రెండు పర్యాయాలు అటవీ శాఖపై ఏజెన్సీ ప్రజాప్రతినిధులు విరుచుకుపడ్డారు. అయినా ఫలితం శూన్యం. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సమావేశం నిర్వహిస్తున్నారు. మధ్యాహ్న భోజన విరామం తరువాత చాలామంది సభ్యులు ఇంటి ముఖం పడుతున్నారు. అసలు సమావేశం నిర్వహణకు సరైన విధంగా కసరత్తు చేయడం లేదనే వాదన ఉంది. సాధారణంగా ముందు షాడో సమావేశం నిర్వహించి ప్రతిసారి కొత్త అంశాలపై చర్చించేలా నిర్ణయం తీసుకోవాలి. ఒకే అంశంపై సభ్యులంతా మాట్లాడే కంటే అంశాల వారీగా సభ్యులు సమస్యలు లేవనెత్తితే సమయం ఆదా అవుతుంది. అయితే ఆ దిశగా చొరవ చూపడం లేదని కొందరు సభ్యులు వ్యాఖ్యానిస్తున్నారు. అలాగే ఒకసారి లేవనెత్తిన సమస్యలు మరోసారి ప్రస్తావనకు రాకుండా పరిష్కరించాలన్న ఆలోచన అధికార యంత్రాంగంలో కూడా కనిపించడం లేదు. గ్రామీణ, ఏజెన్సీలో ఇళ్ల నిర్మాణాల బిల్లులు మంజూరుపై దాదాపు రెండేళ్ల నుంచి సభ్యులు అడుగుతున్నా పరిష్కారం లభించడం లేదు. అలాగే ఏజెన్సీలో విద్య, వైద్య సదుపాయాలు, హాస్టళ్లు, విత్తనాలు సరఫరా, తదితర సమస్యలను ప్రతిసారి సభ్యులు ప్రస్తావిస్తున్నా ఫలితం ఉండడం లేదు. పరవాడ మండలం తానాం గ్రామంలో జల వనరుల శాఖ చేపట్టాల్సిన పనులను గ్రామీణ నీటి సరఫరా విభాగం చేపట్టడం, అందుల్లో నాణ్యత లేకపోవడంపై జడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజు ఏడాది నుంచి ప్రస్తావిస్తూనే ఉన్నారు. బహుశా గురువారం సమావేశంలోనూ చర్చించే అవకాశం ఉంది. అనంతగిరిలో క్షతగాత్రులను ఎస్.కోట నుంచి విశాఖకు తరలించాలని, విజయనగరం ఆస్పత్రికి వద్దని జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు రెండేళ్ల నుంచి కోరుతున్నా ఇంతవరకూ పట్టించుకున్న దాఖలాలు లేవు. జిల్లాలో రోడ్ల దుస్థితి, ఇసుక సరఫరా, ఖరీఫ్‌కు నీటి విడుదల వంటి అంశాలపై గురువారం నాటి సమావేశం దృష్టిసారించాలని పలువురు సభ్యులు కోరుతున్నారు. సమస్యలపై మాటలతో సరిపెట్టకుండా పరిష్కారం అయ్యే దిశగా చొరవ తీసుకోవాలంటున్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జరిమానా

ఎండాడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ కేసులో రెండవ స్పెషల్ జ్యుడీషియల్ కోర్టు జడ్జి ఒకరికి జరిమానా విధించారు. పీఎంపాలెం పోలీస్ స్టేషన్ ఎస్ఐ జి. ప్రసాద్ తెలిపిన వివరాలు ప్రకారం.. స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ఒకరిపై కేసు నమోదు చేశారు. బుధవారం అతన్ని కోర్టులో హాజరుపరచగా రూ. 10 వేల జరిమానా విధించినట్టు ఎస్ఐ చెప్పారు.

25 వేల సభ్యత్వాలు నమోదు : బీజేపీ

భీమునిపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో బీజేపీ 25 వేల సభ్యత్వాలు పూర్తి చేసినట్టు ఆ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఎం. నాగేంద్ర తెలిపారు. బుధవారం ఆయన పట్టణంలోని పార్టీ కార్యాలయంలో క్రియాశీలక సభ్యత్వాల నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధికంగా సభ్యత్వాలు నమోదు చేసిన పది అసెంబ్లీ నియోజకవర్గాల్లో భీమిలి ఒకటన్నారు. ఈమేరకు క్రియాశీలక సభ్యత్వాల నమోదుకు నియోజకవర్గం అర్హత సాధించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రియాశీలక సభ్యత్వాల కోకన్వీనరు బుద్దా లక్ష్మీనారాయణ, పార్టీ నియోజకవర్గ కన్వీనరు కంటుభుక్త రామానాయుడు, సీనియర్ నాయకులు సన్యాసిరావు, నియోజకవర్గ కో కన్వీనర్ పసుపులేటి శ్రీనివాసరావు, జిల్లా మత్స్యకార సెల్ కన్వీనర్ వాసుపల్లి శ్రీహరి, మండల, వార్డు అధ్యక్షులు కంటుభుక్త సునీత, చోడవరపు నాగరాజు, జీఆర్ఎస్ఎన్ రాజు, పూళ్ళ కొండబాబు, శీరపు రామలక్ష్మి, పోలుబోతు విజయ, శ్రీనివాసరావు, ఫణీంద్ర, రాము పాల్గొన్నారు.

జీవో 117 రద్దు పట్ల హర్షం

పద్మనాభం రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబరు 117ను రద్దు చేయ డం పట్ల ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఈమేరకు బుధవారం ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బోని సూర్యనారాయణ, యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ రాము ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ బడులకు ప్రతిబంధకంగా ఉన్న జీవో 117ను రద్దు చేయడం ద్వారా కూటమి ప్రభుత్వం పాఠశాలలకు జీవం పోసిందన్నారు. పాఠశాలల విలీన సమస్యలు నాలుగేళ్లుగా ఉపాధ్యాయులను వెంటాడుతున్నాయని, జీవో రద్దుతో ప్రాథమిక, ఉన్నత విద్య బలోపేతం అవుతుందని చెప్పారు.

ముగిసిన మరిడిమాంబ ఉత్సవాలు

భీమునిపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో జరుగుతున్న మరిడిమాంబ ఉత్సవాలు బుధవారంతో ముగిసాయి. నాగవంశీయుల ఆరాధ్య దేవత మరిడిమాంబ ఉత్సవాలు ఈనెల 21 నుంచి ప్రారంభమైన విషయం తెలిసిందే. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపారు. అలాగే చిన్నబజారు జంక్షన్‌లో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో స్టేజి ప్రోగ్రామ్‌లు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

శిల్పారామం ఏఓపై విచారణ ప్రారంభం

మధురవాడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ శిల్పారామం పరిపాలనాధికారి విశ్వనాథరెడ్డిపై ఉన్నతాధికారులు శాఖాపరమైన విచారణ ప్రారంభించారు. ఆయనపై శిల్పారామంలో పని చేస్తున్న ఒక మహిళ పలు ఆరోపణలు చేస్తూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈమేరకు శిల్పారామం ఉన్నతాధికారులు స్పందించి, విచారణాధికారులుగా పులివెందుల శిల్పారామం ఏఓ సుధాకర్, ఫిర్యాదీదారు మహిళ కావడంతో కాకినాడ శిల్పారామంకు చెందిన మహిళా ఉద్యోగిని సరళను నియమించారు. వారు స్థానిక శిల్పారామంలో ఏఓతో పాటు ఏడుగురు ఉద్యోగులు, ఐదుగురు సెక్యూరిటీ, ఐదుగురు హౌస్ కీపింగ్ సిబ్బందిని వేర్వేరుగా విచారించారు.

అయినాడలో 30 రీసర్వే వినతుల స్వీకరణ

పద్మనాభం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అయినాడలో భూముల రీసర్వే సమస్యలపై అర్జీల స్వీకరణకు బుధవారం నిర్వహించిన గ్రామ సభలో 30 వినతులు స్వీకరించారు. తహసీల్దార్ కె. ఆనందరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభలో రైతులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పేరు మార్పునకు సంబంధించి 21, విస్తీర్ణం సవరణకు 6, జాయింట్ ఫీల్డు సర్వేకు చెందిన 3 వినతులను రైతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డీటీ వరలక్ష్మి, వీఆర్‌ఓ గోపి పాల్గొన్నారు.

రోడ్ల నిర్వహణకు గ్లోబల్ టెండర్స్?

... 5వ పేజీ తరువాయి

మరమ్మతులు, లేయర్ వేయాల్సిన వాటి వివరాలతో జాబితాను రూపొందించి, అంచనాలను బట్టి టెండర్ పిలిచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించినట్టు సమాచారం. రోడ్లు పాడైన వెంటనే మరమ్మతులు చేయడం, అవసరమైన సందర్భాల్లో శాస్త్రీయంగా తారు, పిక్క, హాట్‌మిక్సింగ్ చేసి కొత్త లేయర్ వేయడం పనులను ఆయా సంస్థలకు అప్పగించాలనేది కమిషనర్ భావన. ఆసక్తి గల సంస్థల నుంచి ఆసక్తి వ్యక్తీకరణ (ఈఓఐ), పనులు చేయడానికి ఎంత ఖర్చవుతుందని భావిస్తున్నారో రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్ఎఫ్‌పీ) తీసుకోవాలని ఆదేశించారు. ఆర్ఎఫ్‌పీలో ఆయా పనులను ఎంత తక్కువ ఖర్చుతో చేయవచ్చో పేర్కొంటూ ఇచ్చే నివేదిక ఆధారంగా గ్లోబల్ టెండర్లు పిలిచే అవకాశం ఉందని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు.

ఏయూలో పరీక్ష ఫీజు తగ్గింపు

... 5వ పేజీ తరువాయి

ఇతర ఉన్నతాధి కారులతో చర్చించి కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం ఉన్న పరీక్ష ఫీజులో రూ.450 తగ్గించాలని నిర్ణయం తీసుకున్న అధికారులు వెంటనే అమలు చేయాలని ఆదేశాలు జారీచేశారు. ప్రస్తుతం ఆర్ట్స్ కాలేజీ పరిధిలో వివిధ కోర్సుల్లో చదువుతున్న విద్యార్థులకు సెమిస్టర్ పరీక్ష ఫీజు రూ.1,250. సైన్స్‌తో పాటు ఇతర కాలేజీల విద్యార్థుల పరీక్ష ఫీజు రూ.1350. ఈ మొత్తంలో రూ.450 తగ్గించనున్నారు. అలాగే పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఉన్న గడువును కూడా అధికారులు నవంబరు రెండో తేదీ వరకు పొడిగిస్తూ ఆదేశాలు జారీచేశారు. దీనిపై వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు మాట్లాడుతూ విద్యార్థులు సమస్యను తన దృష్టికి తీసుకువచ్చారని, అధికారులతో చర్చించి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. వర్సిటీలో స్నేహ పూర్వకమైన వాతావరణాన్ని కల్పించామని, అందుకే విద్యార్థులు తమ ఇబ్బందులను నేరుగా వచ్చి తమకు తెలియజేస్తున్నారన్నారు. విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడంతోపాటు పటిష్టమైన, నాణ్యమైన విద్యా బోధన జరిగేలా చూస్తున్నామన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

రుషికొండ కూడలిలో ఈ-పోలీసు కేంద్రం

- నగర సీపీ శంఖబ్రత బాగ్చీ
- నార్త్ జోన్ ఏసీపీ కార్యాలయం సందర్శన

ఎండాడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : బీచ్ రోడ్డులో ఐటీ కంపెనీలు, పలు వర్సిటీలతో పాటు సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉండడంతో రుషికొండలో ఉన్న ఈ-పోలీసు కేంద్రాన్ని పునఃప్రారంభించనున్నట్టు సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. బుధవారం రాత్రి ఆయన పీఎంపాలెం పోలీసు స్టేషన్ ఆవరణలో ఉన్న నార్త్ ఏసీపీ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయం పరిధిలోని పోలీసు అధికారులతో పెండింగ్ కేసులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లా అండ్ అర్డర్ అదుపులో ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. నగరానికి మధురవాడ సిటీ కాస్త దూరంగా ఉండడంతో ప్రత్యేక క్రైమ్ జరిగే అవకాశాలున్న నేపథ్యంలో ఈ ప్రాంతంలో ప్రత్యేక బృందాలతో పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. మధురవాడలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో నార్త్ జోన్ ఏసీపీ అప్పలరాజు, మహిళా స్టేషన్ ఏసీపీ పెంటారావు, భీమిలి, ఆనందపురం, పద్మనాభం, పీఎంపాలెం స్టేషన్ల సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు

భీమునిపట్నం రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో 16 నీటి సంఘాల ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. చెరువు ఆయుకట్టుదారులను ఓటర్లగా గుర్తించి, వారితో ఈ ఎన్నిక నిర్వహిస్తారు. ఈమేరకు అధికారులు ఓటర్ల జాబితాలు తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు. భీమిలి మండలంలో 5, పద్మనాభంలో 7, ఆనందపురంలో 4 సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. భీమిలిలోని దాకమర్రిలో 260 ఎకరాల్లో ఉన్న ఇల్లందేవి చెరువు పరిధిలో 891 మంది ఆయుకట్టుదారులు ఉన్నారు. ఈ చెరువుతో పాటు 30 ఎకరాల్లో ఉన్న తాళ్లవలస పెద్ద చెరువు, సింగనబంద, తాటితూరు పెద్ద చెరువు పరిధిలోనూ ఎక్కువ మంది ఆయుకట్టుదారులు ఉన్నారు. కాపులుప్పాడ పెద్ద చెరువు కింద 260 మంది ఆయకట్టుదారులున్నారు. చెరువుల అభివృద్ధికి నీటి సంఘాలు పనిచేస్తుంటాయి. కొన్నేళ్లుగా వీటికి ఎన్నికలు నిర్వహించలేదు. కూటమి ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తోంది. సభ్యులు అధ్యక్ష, ఉపాధ్యక్షులతో పాటు పది మంది డైరెక్టర్లను ఎన్నుకోనున్నారు.

పద్మనాభంలో ఏడు సంఘాల ఎంపిక

పద్మనాభం : మండలంలో ఏడు సాగునీటి సంఘాలను ఎన్నికలకు నీటిపారుదల శాఖాధికారులు ఎంపిక చేశారు. ఆయకట్టు వంద ఎకరాలు దాటిన చెరువులను సాగునీటి సంఘాలుగా గుర్తించారు. వీటిలో కోరాడలోని కృష్ణంరాజు చెరువు, పొట్నూరులో నూకాంబిక చెరువు, మద్దిలో రాజు-వెంకటపతిరాజు చెరువు, పాండ్రంగిలో కాటమయ్య చెరువు, పెంటలో గుండం చెరువు, గంధవరంలో నరసింహరాజు చెరువు, కర్రివాని చెరువులు ఉన్నాయి. ఈ జాబితాను సర్వే నెంబర్లతో సహా తహసీల్దారుకు ఇరిగేషన్ అధికారులు నివేదించిన వెంటనే ఆయకట్టు రైతులను రెవెన్యూ అధికారులు గుర్తించి, ఆ వివరాలతో ఓటర్ల జాబితాను రూపొందిస్తారు. ఈప్రక్రియ పూర్తయిన వెంటనే నోటిఫికేషన్ జారీ చేయనున్నారు.

జీఎస్ అగ్రహారంలో ప్రభుత్వ భూమి ఆక్రమణ



ఆక్రమిత స్థలంలో జరుగుతున్న పనులు

ఆనందపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామవరం పంచాయతీ జీఎస్ అగ్రహారంలో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైంది. కొందరు స్థానికులు భూమిలో యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ విషయమై ఫిర్యాదులు వెళ్లినా.. రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. గ్రామంలో సర్వే నెంబరు 1లో గ్రామ అవసరాల నిమిత్తం కల్యాణ మండపం నిర్మాణానికి పది సెంట్లు స్థలాన్ని కేటాయించారు. ఆ స్థలంలో గ్రామానికి చెందిన కొంతమంది అక్రమంగా ప్రవేశించి నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రస్తుత మార్కెట్‌లో దీని విలువ సుమారు కోటి రూపాయలు వరకూ ఉంటుందని అంచనా. ఆక్రమణపై 2023లో అప్పటి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయగా స్పందించి నిర్మాణాలు నిలుపుదల చేసి, హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. తరువాత అధికారులు మారడంతో కబ్జాదారులు మళ్లీ ఆ స్థలంలో నిర్మాణాలు చేపట్టడానికి ప్రయత్నిస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి అక్రమ నిర్మాణాలను నిలుపుదల చేయ డంతో పాటు ప్రభుత్వ భూమిని కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

'ఉల్లాస్'ను బాధ్యతగా చేపట్టండి : ఎంపీడీఓ

భీమునిపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మహిళా నిరక్షరాస్యులను విద్యావంతులుగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ (ఉల్లాస్) పథకాన్ని బాధ్యతాయుతంగా చేపట్టాలని ఎంపీడీఓ హనుమంతరావు చెప్పారు. బుధవారం ఆయన మండల మహిళా పొదుపు సంఘాల సమాఖ్య భవనంలో గ్రామ సంఘాల సహాయకులు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా వున్న గ్రామ సంఘాల్లో 15 ఏళ్ల పైబడిన సభ్యుల్లో చదువు మధ్యలో ఆపేసిన లేదా చదువుకోని వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాల్సి ఉందన్నారు. వారికి అక్షరాలు నేర్పడమే కాకుండా ప్రాథమిక విద్య, డిజిటల్ విద్య, ఆర్థిక విద్య అందించాల్సి వుందన్నారు. ఇందుకు గ్రామాల్లో ఉత్సాహవంతులైన స్వచ్ఛంద వలంటీర్ ఉపాధ్యాయులను గుర్తించి వివరాలు తెలియజేయాలని చెప్పారు. ఏపీఎం నాగభూషణరావు మాట్లాడుతూ మండలంలో మొత్తం 109 గ్రూపులను గుర్తించి, ఒక్కో గ్రూపు నుంచి పది మంది నిరక్షరాస్యులకు పథకాన్ని అందిస్తామన్నారు. సమావేశంలో సీసీలు అప్పలనారాయణ, భాస్కర్‌లు, వీఓఏలు , తదితరులు పాల్గొన్నారు.

క్లాప్ కథేంటి?

... 5వ పేజీ తరువాయి

కేటాయించిన వార్డు సచివాలయ పరిధిలోని అన్ని ఇళ్లకు తిరిగి చెత్తను సేకరించాలి. దీనికోసం ఒక్కో వాహనం మూడు ట్రిప్పులు తిరగాలి. అయితే కొన్ని వాహనాల డ్రైవర్లు వార్డు సచివాలయ పరిధిలో ఒక్క ట్రిప్పు మాత్రమే తిరుగుతున్నారు. మరికొన్ని వాహనాల డ్రైవర్లు అయితే ట్రిప్పులను లెక్క చూపించుకునేందుకు కొద్దిపాటి చెత్తలోడుతోనే గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లకు వెళ్లి వచ్చేస్తున్నారు. దీనివల్ల రికార్డులో ట్రిప్పులు లెక్క సరిపోతున్నాసరే వార్డు సచివాలయ పరిధిలోని అన్ని ఇళ్ల నుంచి చెత్తసేకరణ జరగడం లేదు. వారంలో రెండు, మూడు రోజులు మాత్రమే క్లాప్ వాహనం ఇళ్లకు వస్తుండడంతో మిగిలిన రోజుల్లో చెత్తను ప్రజలు రోడ్లపైకి తీసుకువచ్చి పడేస్తున్నారు. దీనివల్ల రోడ్లపై ఎక్కడికక్కడ చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. రోడ్లపై తిరిగే ఆవులు, కుక్కలు చెత్తకుప్పలను ఛిన్నాభిన్నం చేస్తుండడంతో అంతా చెత్తమయం అవుతోంది.ఇది అపారిశుధ్యానికి దారితీస్తోంది.

క్లాప్ వాహనాలన్నీ పక్కాగా తిరగాల్సిందే

జీవీఎంసీ నిధులు ఖర్చు పెడుతున్నప్పటికీ పరిశుభ్రత మెరుగుపడకపోవడంపై కమిషనర్ సంపత్‌కుమార్ తీవ్ర అసహనం వ్యక్తంచేసినట్టు తెలిసింది. ఇకపై క్లాప్ వాహనాలన్నీ తమకు కేటాయించిన వార్డు సచివాలయం పరిధిలో రోజూ చెత్తసేకరణ చేయాల్సిందేనని అధికారులను ఆదేశించినట్టు తెలిసింది. ముందుగా 578 క్లాప్ వాహనాలన్నీ వీధుల్లో తిరిగేలా చూడాలని ఆదేశించినట్టు సమాచారం. రెండో దశలో వాహనాల జీపీఎస్‌లను పక్కాగా సేకరించాలని, ప్రతిరోజూ ఆ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదుచేయాలని ప్రజారోగ్య విభాగం అధికారులకు సూచించినట్టు తెలిసింది. చివరగా ప్రతి వాహనం ఒకట్రిప్పులో కనీసం 1.5 టన్నులు చెత్తను కచ్చితంగా తీసుకువెళ్లేలా చేసేందుకు గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో వేయింగ్ మిషన్ రీడింగ్‌ను ఆన్‌లైన్‌లో నమోదుచేయించాలని స్పష్టంచేసినట్టు తెలిసింది. ఆ డేటా ఆధారంగా వాహనం పనితీరు సంతృప్తికరంగా ఉందా?, లేదా? అనేది అదనపు కమిషనర్, ప్రధాన వైద్యాధికారి, మెకానికల్ ఈఈలు సంయుక్తంగా నిర్ధారించిన తర్వాతే బిల్లు చెల్లింపునకు ప్రతిపాదన పంపించాలని కమిషనర్ ఆదేశించినట్టు తెలిసింది. ఇలా చేయగలిగితే క్లాప్ వాహనాలతో పూర్తిస్థాయిలో పని చేయించుకోవడంతో పాటు నగరంలో పరిశుభ్రత మెరుగుపరచడానికి అవకాశం కలుగుతుందని కమిషనర్ అభిప్రాయపడినట్టు ప్రజారోగ్యం విభాగం అధికారులు చెబుతున్నారు.

☛ సంక్షిప్తంగా..

రేపు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఆరిలోవ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : పైనాపిల్ కాలనీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గల దుర్గానగర్ 11 కేవీ ఫీడర్ మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు జోన్-3 ఈఈ (ఆపరేషన్స్) పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. పాండురంగాపురం, నెహ్రూనగర్, దుర్గాబజారు, లక్ష్మీనగర్, శివాజీనగర్, ప్రగతినగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

విశ్రాంత ఆచార్యులు ప్రసాదరావుకు సత్కారం



ప్రసాదరావును సన్మానిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు, ఆచార్య నరసింహారావు

వెంకోజీపాలెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఏయూ ఆర్ట్స్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్,అర్థశాస్త్ర విభాగం విశ్రాంత ఆచార్యులు బి.ప్రసాదరావును ఏయూ ఉపకులపతి జి.శశిభూషణరావు బుధవారం తన కార్యాలయంలో సత్కరించారు. ఆచార్యునిగా, వర్సిటీలో విభిన్న పదవులను సమర్థవంతంగా నిర్వహించి ప్రస్తుతం ఏయూ ఆంగ్ల మాధ్యమం పాఠశాల కరస్పాండెంట్‌గా అవిశ్రాంత సేవలు అందిస్తున్నందుకు అభినందించారు. పాఠశాల విద్యను బలోపేతం చేయాలని సదుద్దేశంతో ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి ఆంగ్ల మాధ్యమం పాఠశాలను అభివృద్ధి చేసిన విధానం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు పాల్గొన్నారు.

పోలియో నిర్మూలనపై నిర్లక్ష్యం తగదు

రామ్‌నగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : చిన్నారులకు పోలియో చుక్కల మందు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కొన్ని చోట్ల కేసులు నమోదవుతున్నాయని, ఈ విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని పిల్లల వైద్య నిపుణుడు సాయి సునీల్‌కుమార్ పేర్కొన్నారు. అంతర్జాతీయ పోలియో నివారణ దినోత్సవం సందర్భంగా బుధవారం బీచ్ రోడ్డులో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితమంతా వైకల్యాన్ని మిగిల్చే పోలియో మహమ్మారిని నిర్మూలించాల్సిన అవసరం ఉందన్నారు. దీనికి అందరి సహకారం అవసరమన్నారు.

సినిమా గైడ్

● **వేట్టయాన్ :** సంగం, రమాదేవి, వెంకటేశ్వర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్, లక్ష్మి (గాజువాక), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాత (తగరపువలస)

● **విశ్వం :** మెలోడి, శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీ నరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాల పట్నం),మోహిని కాంప్లెక్స్, లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

● **జనక అయితే గనక :** శారద, కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక), గణేష్ (తగరపువలస)

● **మా నాన్న సూపర్‌హీరో :** గోకుల్, మౌర్య (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)

● **స్వాగ్ :** శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నటరాజ్-2 (పెందుర్తి), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)

● **దేవర :** జగదాంబ, శరత్, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)

● **సత్యం సుందరం :** శ్రీరామ

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 53, టమాటా 47, వంకాయలు (తెలుపు) 42, వంకాయలు (నలుపు) 60, బెండకాయలు 40, పచ్చిమిర్చి 52, కాకరకాయలు 42, బీరకాయలు 30, ఆనపకాయ 28, కాలీఫ్లవర్ 44, క్యాబేజీ 30, క్యారెట్ 58 దొండకాయలు 36, బంగాళదుంపలు 30, అరటికాయ (పె) 8, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 100, బరబటి 44, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 36, దోసకాయలు 38, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 140, పొటల్స్ 52, కీరదోస 28, కాప్సికమ్ 74, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40, చిలగడదుంపలు 28, కంద 62, దేముడు చిక్కుడు 74, కొండ ఉసిరి 85, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 30, మామిడి అల్లం 74, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	110
ఫారం ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240

నివాసాల మధ్య మద్యం దుకాణాలా!



పాత వెంకోజీపాలెంలో షాపింగ్ కాంప్లెక్స్, నివాసాల ఉన్న చోట వైన్ షాపు

» షాపుల ఏర్పాటులో కానరాని నియమ నిబంధనలు

» ఇదేం విధానమంటూ ప్రశ్నిస్తున్న స్థానికులు

వెంకోజీపాలెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నూతన మద్యం పాలసీతో పలు చోట్ల వైన్‌షాపులు వెలియడంతో మందుబాబులు ఖుషీగా ఉన్నారు. అయితే షాపుల ఏర్పాటులో అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. గతంలో ప్రాంతానికో వైన్ దుకాణం ఉండేది. ఇప్పుడు అడుక్కో వైన్ షాపు ఏర్పాటవుతున్నది. షాపులు ఏర్పాటు చేస్తున్న విధానాన్ని చూస్తుంటే.. అసలు మద్యం దుకాణాలను ఎక్కడ ఏర్పాటు చేయాలన్న విషయంలో నియమ నిబంధనలు లేవా అన్న అనుమానం కలుగుతోందని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.

గతంలో హెచ్‌బీ కాలనీ ప్రాంతంలో బస్టాప్ వద్ద ఒక వైన్ షాపు ఉండేది. ఇప్పుడు 100 మీటర్ల దూరంలో మూడు మద్యం దుకాణాలు వెలిశాయి. పాత వెంకోజీపాలెంలో హెచ్‌బీ కాలనీ నుంచి కృష్ణా కళాశాలకు వెళ్లే మార్గంలో నూతనంగా ఏర్పాటైన ఓ వైన్ షాపు మరీ ఇళ్ల మధ్య ఉండడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తెల్లారితే ఇదే ప్రాంతంలో చిన్నారులు, మహిళలు, కూలీలు అన్ని వయసుల వారు ఇక్కడ నుంచి తమ విధులను బయలు దేరుతారని, అటువంటి ప్రాంతంలో మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. మద్యం దుకాణం ఏర్పాటుకు కనీసం బడి, గుడి, వీధి అనే తేడా కూడా లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరీ నివాసాల మధ్యలో మద్యం దుకాణాలను ఏర్పాటు చేస్తే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. దుకాణాల కేటాయింపులో కనీస జాగ్రత్తలు పాటించకుంటే ఎలా అంటూ నిలదీస్తున్నారు.

ఈ నూతన దుకాణానికి రెండు మార్గాల అవతల ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కార్యాలయం ఉందని, కనీసం వారు దీని అనుమతిపై ఆలోచన కూడా చేయకపోవడం దుర్మార్గమని వారు వాపోతున్నారు. ఇలా అయితే ప్రధాన రోడ్లే కాదని, వీధుల్లో కూడా చిన్నారులు, మహిళలు స్వేచ్ఛగా తిరిగే అవకాశాన్ని కోల్పోతామని ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై ఎక్సైజ్ శాఖ పునరాలోచించాలని స్థానికులు కోరుతున్నారు.

రైల్వేస్టేషన్లలో హెల్ప్‌లైను నంబర్లు

తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో యంత్రాంగాన్ని సిద్ధంచేసిన వాల్తేరు డీఆర్ఎం



సిబ్బందికి సూచనలిస్తున్న డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్

విశాఖపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): దానా తుఫాన్ తీవ్ర ప్రభావ హెచ్చరికల నేపథ్యంలో వాల్తేరు డివిజన్ ప్రత్యేక ముందస్తు సన్నాహక భద్రత చర్యలు చేపట్టింది. బుధవారం డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ శ్రీకాకుళం రోడ్డు స్టేషన్‌లో పర్యటించి ఏర్పాట్లపై సమీక్షించారు. ట్రాక్‌లు, విద్యుదీకరణ, సిగ్నలింగ్ వ్యవస్థలపై సంబంధిత అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. తుఫాన్ కారణంగా ఏమైనా దెబ్బతింటే యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. డీజిల్ లోకోమోటివ్‌లను సిద్ధంగా ఉంచుకుని విద్యుత్ వైఫల్య సమయంలో ఉపయోగించుకోవాలని సూచించారు. రైళ్ల రాకపోకలు సాఫీగా జరిగేందుకు ట్రాక్‌లపై ఎప్పటికప్పుడు పెట్రోలింగ్ నిర్వహించాలని, పెట్రోలింగ్ మెన్ విధుల నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించి ప్రమాదాలు, అంతరాయాలను గుర్తించి తక్షణమే సమాచారమివ్వాలన్నారు. పూర్తి స్థాయి పరికరాలతో ఇంజనీరింగ్ రిలీఫ్ వ్యాన్‌లను సిద్ధంగా ఉంచాలని, ప్రసార వ్యవస్థ ద్వారా రైళ్ల రాకపోకలపై ప్రయాణికులను అప్రమత్తం చేయడంతోపాటు ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. వాల్తేరు డివిజన్ పరిధిలోని అన్ని స్టేషన్లలో వైద్యసదుపాయ బృందాలను ఏర్పాటు చేయాలని, వాతావరణ శాఖ హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.స్టేషన్లలో హెల్ప్ డెస్క్‌లతోపాటు టికెట్లు రద్దు చేసుకునేవారికి సౌకర్యవంతంగా అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. సివిల్ డిఫెన్స్, స్కౌట్స్ అండ్ గైడ్స్ వలంటీర్లు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ పర్యటనలో ఏడీఆర్ఎంలు సుధీర్‌కుమార్ గుప్తా, మనోజ్‌కుమార్ సాహు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

హెల్ప్ లైను నంబర్లు: విశాఖ రైల్వేస్టేషన్...0891 -2746330, 0891-2744619, 8712641255, 7780787054

విజయనగరం; 08922-221202, 8712641260; శ్రీకాకుళం రోడ్డు; 08942-286213, 08942-286245; దువ్వాడ; 8500358524; రాయగడ; 06856223400, 9439741071

ఏయూ రిజిస్ట్రార్ విదేశీ విద్యార్థుల హాస్టల్ సందర్శన



హాస్టల్ సందర్శిస్తున్న రిజిస్ట్రార్ ధనుంజయరావు, చీఫ్ వార్డెన్ డాక్టర్ యుగంధర్ తదితరులు

వెంకోజీపాలెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఏయూ విదేశీ విద్యార్థుల హాస్టల్‌ను ఏయూ రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్స్‌లో విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి అక్కడే భోజనం చేశారు. ఏయూ పూర్తి స్థాయిలో విద్యార్థులకు సహకారం అందిస్తూ పరిపాలన సాగిస్తోందని చెప్పారు. విద్యార్థులకు ఎటువంటి సహాయం అవసరమైన వెంటనే తమను సంప్రదించాలని సూచించారు. ఇటీవల కాలంలో హాస్టల్స్‌లో చేపట్టిన మరమ్మతులు, నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాలను చీఫ్ వార్డెన్ డాక్టర్ ఎస్.ఎం.యుగంధర్ వివరించారు. హాస్టల్ అభివృద్ధికి అవసరమైన సంపూర్ణ సహకారాన్ని సత్వరమే అందిస్తామని రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావు ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఆచార్యులు పాల్గొన్నారు.

తోపుడుబండ్ల కార్మికులపై దాడులు దారుణం

» సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కెఎస్వీ కుమార్



ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నేతలు, తోపుడుబండ్ల కార్మికులు

మద్దిలపాలెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : తోపుడు బండ్ల కార్మికులపై దాడులు ఆపాలని డిమాండ్ చేస్తూ బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మద్దిలపాలెం జాతీయరహదారిపై చిల్లర వర్తకులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కె.ఎస్వీ కుమార్ మాట్లాడుతూ కొత్తగా వచ్చిన జీవీఎంసీ కమిషనర్, జోనల్ కమిషనర్లు తోపుడుబండ్లపై దాడులు చేపట్టేలా నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శించారు. స్వయం ఉపాధితో బతుకుతున్న చిరు వర్తకులపై ఇలా ప్రతాపం చూపడం తగదన్నారు. 2014లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వీధి వ్యాపారుల చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఎక్కడ బతికే చిరువర్తకులను అక్కడే బతకనీయాలన్నారు. ఇప్పటికే చినవాల్తేరు, సిరిపురం రోడ్డుల్లో తోపుడు బండ్లను తొలగించి వారి పొట్టకొట్టారన్నారు. ఇప్పటికైనా తోపుడుబండ్లపై దాడులు ఆపి స్ట్రీట్ వెండర్స్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు కృష్ణారావు మాట్లాడుతూ తోపుడుబండ్లపై దాడులు ఆపకుంటే జీవీఎంసీ ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నేతలు అవపర్తి అప్పారావు, కె.కుమారి, వై.సాయి, కార్మికులు పాల్గొన్నారు.

ఆరిలోవలో కార్డినల్ సెర్చింగ్

» 16 వాహనాలు సీజ్



పోలీసులు సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలు

ఆరిలోవ, అక్టోబరు 23 : (అంధజ్యోతి) : తూర్పు ఏసీపీ రాంబాబు ఆధ్వర్యంలో పోలీసుల బృందం బుధవారం తెల్లవారు జామున ఆరిలోవ పోలీసు స్టేషన్ పరిధిలో కార్డినల్ సెర్చింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పైనాపిల్ కాలనీ, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, రామకృష్ణాపురం, శ్రీకృష్ణాపురం తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ఆరిలోవ ప్రాంతంలోని పలు ఖాళీ ప్రాంతాలతో పాటు కొండవాలు, అటవీ ప్రాంతాల్లో పరిశీలించారు. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా ఉన్న సుమారు 16 వాహనాలను సీజ్ చేసినట్టు ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. ముగ్గురు సీఐలు, 10 మంది ఎస్ఐలు, సుమారు 65 మంది కానిస్టేబుళ్లు పాల్గొన్నట్టు చెప్పారు. గంజాయి విక్రయాల గురించి ఆరా తీశామని, అలాగే అసాంఘిక కార్యకలాపాల జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో తనిఖీలు చేశామని సీఐ చెప్పారు. స్థానికులతో మాట్లాడి ఎవరైనా కొత్త వారు వచ్చినా, అనుమానాస్పద వ్యక్తులు ఎదురైనా, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయించినట్టు తెలిసినా వెంటనే తమకు తెలియజేయాలని కోరినట్టు చెప్పారు. సమాచారం ఇచ్చిన వారి పేరు గుప్తంగా ఉంచుతామన్నారు.

కాగా, తెల్లవారి జాము కావడం, ఈ ప్రాంతంలో ఒక్కసారిగా పెద్ద సంఖ్యలో పోలీసులు వచ్చి తనిఖీలు చేపట్టడంతో స్థానికులు ఏం జరిగిందోనన్న భయాందోళనలకు గురయ్యారు.

15న రాధాకృష్ణ మహోత్సవాలు

» విశాఖ జిల్లా యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఒమ్మి సన్యాసిరావు తదితరులు

మద్దిలపాలెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : విశాఖ జిల్లా యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వచ్చే నెల 15న రాధాకృష్ణమహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్టు సంఘం అధ్యక్షుడు ఒమ్మి సన్యాసిరావు తెలిపారు. బుధవారం మహోత్సవాల కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవులకు అండగా ఉండే శ్రీకృష్ణుడు పూజలను ప్రతీ ఏడాది అంగరంగ వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ ఏడాది నిర్వహించే రాధాకృష్ణ మహోత్సవాల్లో ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వంశీకృష్ణశ్రీనివాస్, నగర మేయర్ వెంకటహరికుమారి, యాదవ పెద్దలు పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బొట్టా వెంకటరమణ, గొంప అప్పారావు, కనకరాజు, సారిపిల్లి కృష్ణ, మొల్లి లక్ష్మణ్, చినతల్లి, శశిధర్, ఈగల సత్యం, ఒమ్మి అప్పారావు, డొక్కరి శ్రీనివాసరావు, కోడిబోయిన ఆనంద్, పరదేశి పాల్గొన్నారు.

ప్రభుత్వ నర్సింగ్ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షురాలిగా గంగాభవానీ



విజయం సాధించిన గంగా భవానీ ప్యానల్ అభ్యర్థులు

మహారాణిపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రతిష్ఠాత్మకంగా జరిగిన జిల్లా ప్రభుత్వ నర్సింగ్ ఉద్యోగుల సంఘ ఎన్నికల్లో టి.గంగాభవానీ అత్యధిక మెజారిటీతో అధ్యక్షురాలిగా ఎన్నికయ్యా రు. ఆమె ప్యానల్ అభ్యర్థులు సైతం గెలుపొందారు. కేజీహెచ్ క్లాక్ టవర్ ప్రాంగణంలో బుధవారం ఎన్నికలు నిర్వహించారు, ఆరేళ్ల తరువాత ఈ ఎన్నికలురాజకీయ పక్షాలను తలపించేలా పోలీసు బందోబస్తు మధ్య హోరాహోరీగా జరిగాయి. ఉమ్మడి విశాఖ జిల్లా వ్యాప్తంగా మొత్తం 555 మంది ఓటర్లలో 521 మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. అనకాపల్లి, నర్సీపట్నం, అరుకు, పాడేరు సహా వివిధ ప్రాంతాల నుంచి నర్సింగ్ సిబ్బంది వచ్చి తమ ఓటుహక్కు వినియోగించుకు న్నారు. అధ్యక్ష పదవికి పోటీపడిన టి.గంగాభవానీ, వి.ఉషా రాణిలు తమ ప్యానల్ సభ్యులుగా తొమ్మిది మంది చొప్పున రంగంలోకి దింపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నిలు నిర్వహించి, అనంతరం ఓట్లు లెక్కించి ఫలితాలు వెల్లడించారు. ఈ ఎన్నికల్లో టి.గంగా భవానీ 336 ఓట్లు సాధించి జిల్లా సంఘ అధ్యక్షురాలిగా గెలుపొందారు. కార్యదర్శిగా జి.వి.ఎస్ వరలక్ష్మి (319 ఓట్లు), కోశాధికారిగా బుద్దరాజు వంశీ (329 ఓట్లు)లు విజేతలయ్యారు. ఈసీ సభ్యులుగా ఎస్.మెహర్ శాంతి, వియ్యపు వినీలా, దాసరి లిల్లీ గ్రేస్, ఎస్ .గంగాగౌరీ, టి.పద్మజలు ఎన్నికయ్యారు.

స్కూల్ గేమ్స్ బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం

విశాఖపట్నం (స్పోర్ట్సు), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) జిల్లా స్థాయి అండర్-14, 17 బాలురు, బాలికల బాస్కెట్‌బాల్ పోటీలు కమ్ రాష్ట్ర స్థాయి టోర్నీకి ఎంపికలు బుధవారం ప్రారంభమయ్యాయి. సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో జరుగుతున్న ఈ పోటీలకు పినాకిల్ హాస్పిటల్స్ డైరెక్టర్ కె.నివేదిత ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని అభినందించారు. బాస్కెట్‌బాల్ సీనియర్ కోచ్ బొజ్జా రామయ్య, శేషగిరిరావు పాల్గొనగా, జిల్లా జట్టు సెలక్షన్ కమిటీ సభ్యులుగా రామచంద్రరావు, జగదీష్, భవానీ, శ్రీనివాస్, తబిత వ్యవహరించారు.

పర్యావరణ అంచనాల కమిటీలో ఉత్తరాంధ్ర నుంచి ముగ్గురికి చోటు



గిరిజాశంకర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు తదితరులు

విశాఖపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పరిశ్రమలు, ఇతర సంస్థల ఏర్పాటుకు సంబంధించి రాష్ట్ర స్థాయి పర్యావరణ అంచనాల కమిటీలో సభ్యులగా ఉత్తరాంధ్ర నుంచి ముగ్గురికి చోటు లభించింది. మూడేళ్లపాటు కమిటీలో కొనసాగేందుకు వీలుగా ఏయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.గిరిజాశంకర్, శ్రీకాకుళం అంబేడ్కర్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య పీలా సుజాత, ఎండాడకు చెందిన జి.వీరవెంకట సత్యనారాయణ చౌదరిని నియమించారు. ఈ మేరకు కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ సందర్భంగా గిరిజాశంకర్‌ను వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు అభినందించారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ ఎస్.కిశోర్‌బాబు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎన్ ధనుంజయరావు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.నరసింహారావు, డీసీఎంఎస్ హెచ్‌వోడీ జాలాది రవి తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ పరిశీలించిన కలెక్టర్



రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ హరీంధిరప్రసాద్

ఆరిలోవ, అక్టోబరు 23 : (ఆంధ్రజ్యోతి) : చినగదిలి రూరల్ మండలం తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలో గల ఈవీఎం గోదాంలను జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరీంధిరప్రసాద్ బుధవారం తనిఖీ చేశారు. నెలవారి తనిఖీల్లో భాగంగా బుధవారం ఉదయం గోదాంలను సందర్శించారు. సీసీ కెమెరాల పనితీరు, ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లను పరిశీలించారు. భద్రతా ప్రమాణాలపై అక్కడ అధికారులు, భద్రతా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట రూరల్ తహసీల్దార్ పాల్ కిరణ్, ఎలక్షన్ సెల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

అణుశక్తిపై విద్యార్థులకు అవగాహన సదస్సు



అణుశక్తిపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎన్‌పీసీఎల్ ప్రతినిధి

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : అణుశక్తిపై విద్యార్థులకు అవగాహన కల్పించే కార్యక్రమాలకు న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, ఎగ్జికాన్ ఈవెంట్స్ మీడియా సొల్యూషన్స్ లిమిటెడ్ సంయుక్తంగా నడుం చుట్టాయి. ఎంవీపీ కాలనీ, సీతమ్మధార, మద్దిలపాలెం తదితర ప్రాంతాల్లో పలు ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమాలను నిర్వహించాయి. భారత దేశ ఇంధన భవిష్యత్తును రూపొందించడాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు సంస్థలు పేర్కొన్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, చర్చావేదికలు, చిత్రలేఖనం, నినాదాల రచన, క్విజ్ వంటి పలు పోటీలను నిర్వహించారు. ది పవర్ చాంప్స్ పేరిట నగరంలోని పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సంస్థలు తెలిపాయి.

డీసీఎంఎస్ ఆచార్యునికి అభినందనలు



హనుమంతరావును అభినందిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు తదితరులు

వెంకోజీపాలెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.హనుమంతరావును ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు బుధవారం అభినందించారు. ఇటీవల మలేషియాలో జరిగిన ఇండో-మలేషియా ఎడ్యుకేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డుల ప్రధానోత్సవంలో డాక్టర్ హనుమంతరావుకు 'ది బెస్ట్ అకడమిక్ రీసెర్చర్ ఇన్ మేనేజ్మెంట్ స్టడీస్' అవార్డు లభించింది. ఈ సందర్భంగా ఆయనను వీసీ తన కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, డీసీఎంఎస్ విభాగాధిపతి ఆచార్య జాలాది రవి తదితరులు పాల్గొన్నారు.

సెమినార్ హాలు నిర్మాణాన్ని పరిశీలించిన ఏయూ వీసీ



నిర్మాణ పనుల గురించి వాకబు చేస్తున్న వీసీ శశిభూషణరావు

వెంకోజీపాలెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఏయూలోని సిల్వర్ జూబ్లీ క్రీడా మైదానంలో నిర్మాణంలో ఉన్న రామినేని కోదండరామయ్య సెమినార్ హాలును బుధవారం ఏయూ వీసీ జి.శశిభూషణరావు పరిశీలించారు. ఈ సందర్భంగా పూర్వ అంతర్జాతీయ వాలీబాల్ కోచ్, మాజీ విశాఖ ఒలింపిక్ అసోసియేషన్ చైర్మన్ స్వర్గీయ కోదండరామయ్య పేరు మీదుగా ఆయన కుమారుడు రామినేని శ్రీధర్ ఏయూలో 250 సీట్లతో సెమినార్ హాలు నిర్మాణానికి తలపెట్టినందుకు వీసీ అభినందించారు. ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్య ఎన్.వి జయమోహన్ మాట్లాడుతూ ఈ సెమినార్ హాలు సుమారు రూ.2 కోట్లతో నిర్మాణం జరుగుతుందని, ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మాణం చేయడం అభినందనీయం అన్నారు. మరో మూడు అంతస్థులు నిర్మాణం చేసే విధంగా ఫౌండేషన్ ఏర్పాటు చేయడం మంచి పరిణామంగా తెలిపారు. ఈ సెమినార్ హాలుకు సెంట్రల్ ఏసీతో పాటు సదస్సులు నిర్వహించేందుకు అన్ని సదుపాయాలు కల్పించారన్నారు. కార్యక్రమంలో ఏపీ ఒలింపిక్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ రామినేని శివలింగప్రసాద్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ శ్రీధర్ పాల్గొన్నారు.

జాతీయ టేబుల్ టెన్నిస్ టోర్నీ అంపైర్‌గా శర్మ



విశాఖపట్నం (స్పోర్ట్సు), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): యూటీటీ జాతీయ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీకి నగరానికి చెందిన ఎల్ఐసీ ఉద్యోగి డాక్టర్ డీవీఎస్‌వై.శర్మ అంపైర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు భారత టేబుల్ టెన్నిస్ సమాఖ్య బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. హర్యానాలోని పంచకులలో జరిగే టోర్నీకి సీనియర్ అంపైర్‌గా వ్యవహరించనున్నారు. ఎల్ఐసీ స్పోర్ట్సు ప్రమోషన్ బోర్డు మెంబరుగా, టేబుల్ టెన్నిస్ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా, జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శిగా శర్మ సేవలందిస్తున్నారు.

తాగునీటి సరఫరాకు రేపు అంతరాయం

▸ ట్యాంకర్ల ద్వారా ఇస్తాం: ఈఈ సుధాకర్

సీతమ్మధార, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ 3వ జోన్‌లో 24, 26 వార్డుల పరిధిలో ఈ నెల 25న పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని జీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగం కార్య నిర్వాహక ఇంజనీరు టి.ఎల్. సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవీఎంసీ సీతమ్మధార, టీపీటీ కాలనీ ప్రాంతంలో పైపులైన్ మరమ్మతులకు గురైనందున శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జోన్ 3 పరిధి 24వ వార్డు టీపీటీ కాలనీ, పీఅండ్‌టీ కాలనీ, నక్కవానిపాలెం, గాంధీనగర్, చైతన్యనగర్, క్రాంతినగర్, శారద స్కూల్ ప్రాంతం, 26వ వార్డు పరిధిలోని రామకృష్ణనగర్, లలితా నగర్, శంకరమఠం మెయిన్ రోడ్డు, చిన్నూరు, మంగలవీధి తదితర ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ప్రజలకు, అత్యవసరమైన ప్రదేశాలలో తాగునీటికి ఇబ్బంది కలగకుండా ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తామని కార్యనిర్వాహక ఇంజనీరు తెలిపారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

జ్ఞానాపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) ఏపీఈపీడీసీఎల్ జోన్-2లోని కంచరపాలెం సబ్ స్టేషన్ పరిధి 11 కేవీ ఫీడర్‌లో చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ల మార్పు కారణంగా శుక్రవారం నేవల్ ఏరియా, చాకలిగెడ్డ, ఆశవానిపాలెం ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు జోన్-2 ఈఈ బీకే నాయుడు తెలిపారు.

మందుబాబులకు జైలు, జరిమానా

మర్రిపాలెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడుపుతూ తనిఖీల్లో దొరికిన ఎనిమిదిమందిని బుధవారం ఐదో మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా ఆరుగురికి రూ.10 వేల నుంచి రూ.18 వేల చొప్పున జరిమానా విధించారు. మరో ఇద్దరికి 7 రోజులు జైలుశిక్ష విధించినట్లు కంచరపాలెం ట్రాఫిక్ సీఐ దాశరథి తెలిపారు.

రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రజల ఆశలు నెరవేర్చాలి

▸ కాంగ్రెస్ నేత మూల వెంకటరావు

మాధవధార, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సీఎం ఎన్.చంద్రబాబునాయుడు ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల ప్రజల ఆశలు నెరవేర్చాలని ఏపీ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ మూల వెంకటరావు కోరారు. అన్నిరంగాల్లో వెనుకబడి ఉన్న ఈ ప్రాంతాల్ని ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి ఫలాలు అందించాలన్నారు. తుదిదశలో ఉన్న రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల్ని పూర్తి చేయాలని కోరారు. ఈ ప్రాంత ప్రజలు ఇక్కడ సరైన అభివృద్ధి లేక హైదరాబాద్, ముంబయి, బెంగళూరు ప్రాంతాలకు వలసపోతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రానికి పరిశ్రమల అవసరం ఎంత ఉందో, వ్యవసాయరంగానికి కూడా ఊతమివ్వడం ద్వారా ఉత్తరాంధ్ర ప్రాంతాల నుంచి వలసలు అరికట్టాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

జాతీయ టేబుల్ టెన్నిస్ టోర్నీ అంపైర్‌గా శర్మ



విశాఖపట్నం (స్పోర్ట్సు), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): యూటీటీ జాతీయ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీకి నగరానికి చెందిన ఎల్ఐసీ ఉద్యోగి డాక్టర్ డీవీఎస్‌వై. శర్మ అంపైర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు భారత టేబుల్ టెన్నిస్ సమాఖ్య బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. హర్యానాలోని పంచకులలో జరిగే టోర్నీకి సీనియర్ అంపైర్‌గా వ్యవహరించనున్నారు. ఎల్ఐసీ స్పోర్ట్సు ప్రమోషన్ బోర్డు మెంబరుగా, టేబుల్ టెన్నిస్ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా, జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శిగా శర్మ సేవలందిస్తున్నారు.

గుర్తింపులేని పేర్లతో కార్యకలాపాలు నిర్వహిస్తే బీవీపీకి సంబంధంలేదు

▸ కార్యదర్శి ధూళిపాల పురుషోత్తమ శాస్త్రి

డాబాగార్డెన్స్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): భారత్ వికాస్ పరిషత్ (బీవీపీ) రాష్ట్ర కార్యవర్గం అనుమతి లేకుండా వేరే పేరుతో ఎవరైనా కార్యక్రమాలు నిర్వహిస్తే సంస్థ బాధ్యత వహించదని బీవీపీ దక్షిణ ప్రాంత పరిధి ప్రధాన కార్యదర్శి ధూళిపాల పురుషోత్తమ శాస్త్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారత్ వికాస్ పరిషత్ జాతీయ, ప్రాంతీయ, విశాఖపట్నం స్థాయిలో ధ్రువీకరణ పత్రంతో అనుమతి పొంది కొన్నేళ్లుగా నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తున్న శాఖలు, భారత్ వికాస్ పరిషత్ విశాఖపట్నం శాఖ, మహిళా సభ్యులతో మాత్రమే ఏర్పాటైన భారత్ వికాస్ పరిషత్ ఝాన్సీ లక్ష్మీబాయి శాఖ సేవా కార్యక్రమాలు చేపడుతున్నాయని చెప్పారు. అలా కాకుండా వేరొక పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తే బీవీపీ రాష్ట్ర కార్యవర్గం బాధ్యత వహించదన్నారు. ఈ విషయమై విచారణ జరిపి నివేదికను రాష్ట్ర కార్యవర్గంతో ప్రాంతీయ కార్యవర్గానికి అందజేయాలని రీజనల్ జాయింట్ జనరల్ సెక్రటరీ ఎంవీవీ సత్యనారాయణను కోరినట్టు పురుషోత్తమ శాస్త్రి తెలిపారు.

అట్టహాసమే.. ఆచరణ శూన్యం

▸ రూపుదాల్చని బర్మాక్యాంప్ భవనం

▸ కాంట్రాక్టరుకు నోటీస్ పంపిన జీవీఎంసీ అధికారులు



భూమి పూజ చేసిన ప్రాంతంలో పిచ్చిమొక్కలు

మురళీనగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉత్తరంలో గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన పనులు ఆరంభశూరత్వంగానే మిగిలిపోయాయి. 49వ వార్డు బర్మాక్యాంప్ ఎల్‌బీనగర్‌లో నిరుపయోగంగా ఉన్న పాత పీహెచ్‌సీ భవనం స్థలంలో ప్రజోపయోగ నిర్మాణం చేపట్టాలని స్థానికులు మొరపెట్టుకోవడంతో ఎట్టకేలకు గత పాలకుల్లో చలనం వచ్చి దాన్ని కూల్చివేసి, కొత్త భవనం నిర్మాణానికి భూమి పూజ చేశారు. రూ.61 లక్షల జీవీఎంసీ నిధులు కేటాయించారు. రెండంతస్తుల భవనం నిర్మించాక, ఒక అంతస్తు సామాజిక అవసరాలకు, రెండో అంతస్తును సచివాలయానికి కేటాయించేలా ప్రణాళిక రూపొందించారు. అట్టహాసంగా పనుల ప్రారంభ ఫలకాలు వేసి ప్రసంగాలు దంచారు. పాత భవనం కూల్చేసి, ఫర్నీచరు, ఐరన్, ఇతరత్రా పనికొచ్చే వస్తువుల్ని అమ్మేసుకున్న కాంట్రాక్టరు, ఆ తర్వాత మిన్నకుండిపోయారు. ఆయన ఈ వార్డు కార్పొరేటరుకు సన్నిహితుడు. దత్తసాయి కన్‌స్ట్రక్షన్ పేరిట జీవీఎంసీతో కాంట్రాక్టు దక్కించుకుని పనుల ఒప్పందం చేసుకున్నారు. గతేడాది డిసెంబరులో ఒప్పందం మేరకు భూమి పూజ జరిగింది. 2024 జనవరిలో పాత భవనం కూల్చడంతో పనులు పడకేశాయి. భవనం తొలగించిన ప్రాంతం ఇపుడు పిచ్చిమొక్కలు, చెత్తా చెదారాలతో నిండి అధ్వాన్నంగా తయారైంది. పనులు ఎపుడు మొదలవుతాయో తెలియక ప్రజలు గగ్గోలు పెట్టడంతో ఎట్టకేలకు దత్తసాయి కన్‌స్ట్రక్షన్ నిర్వాహకులకు జీవీఎంసీ జోన్-5 అధికారులు నోటీసులు ఇచ్చారు. దీనికి కూడా సదరు నిర్మాణ సంస్థ నుంచి స్పందన లేదు. మరోసారి నోటీసు ఇచ్చి, అప్పటికీ స్పందన లేకపోతే, మహావిశాఖ నగర పాలక సంస్థ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని ఇంజనీరింగ్ విభాగం ఏఇ సాయినాథ్ తెలిపారు.

'నివాసాల మధ్య మద్యం దుకాణం వద్దు'



నిరసన నినాదాలు చేస్తున్న పందిమెట్టవాసులు

మహారాణిపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పందిమెట్ట ఏరియా నివాస స్థలాల్లో మద్యం దుకాణం వద్దని స్థానికులు బుధవారం ఆందోళన చేపట్టారు. కూటమి ప్రభుత్వం నూతన మద్యం విధానంలో భాగంగా కొత్త దుకాణాలు ఏర్పాటు చేయటంలో భాగంగా నౌరోజీ రోడ్డులోని పంది జంక్షన్‌లో ప్రారంభ సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో జనసేన సీనియర్ నాయకుడు నెక్కళ్ళ త్రినాథ్ ఆధ్వర్యంలో స్థానికులు మద్యం దుకాణం ఇక్కడ ఏర్పాటు చేయవద్దంటూ బైఠాయించి నిరసన నినాదాలు చేశారు. నివాస ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే తమకు ప్రమాదకరమని, సమీపంలో ఉన్న బార్ అండ్ రెస్టారెంట్ కారణంగా ఇప్పటికే అనేక సమస్యలు ఎదుర్కొంటున్నామని గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు నివాస ప్రాంతాల మధ్య మరో మద్యందుకాణం ఏర్పాటు చేస్తే మరిన్ని ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఇబ్బందులు గమనించి మద్యం దుకాణం ఇక్కడ నెలకొల్పకుండా నేతలు చొరవ చూపాలని కోరారు. ఆందోళనలో కాయితపు మణి, శ్రీనివాసరావు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

ప్రమిదల తయారీలో దివ్యాంగులకు శిక్షణ



దివ్యాంగ విద్యార్థులతో దీపావళి ప్రమిదలు తయారు చేయిస్తున్న నిర్వాహకులు

అక్కయ్యపాలెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్డు జగన్నాథపురంలోని ప్రజ్వల్ వాణి వెల్ఫేర్ సొసైటీ కార్యాలయంలో దీపావళికి సంబంధించిన వివిధ రకాల ప్రమిదల తయారీలో శిక్షణ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. దివ్యాంగ విద్యార్థులకు స్వయం ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ప్రమిదలు, కొవ్వొత్తులు తదితర సామగ్రిని తయారు చేసేలా శిక్షణ ఇస్తున్నట్లు సొసైటీ వ్యవస్థాపకురాలు సుచిత్ర బాలకృష్ణ తెలిపారు.

జిల్లా ప్రభుత్వ నర్సింగ్ ఉద్యోగుల సంఘ అధ్యక్షురాలిగా గంగాభవానీ



విజయచిహ్నం చూపిస్తున్న గంగా భవానీ ప్యానల్ అభ్యర్థులు

మహారాణిపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మకంగా జరిగిన జిల్లా ప్రభుత్వ నర్సింగ్ ఉద్యోగుల సంఘ ఎన్నికల్లో టి.గంగాభవానీ అత్యధిక మెజారిటీతో అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. ఆమె ప్యానల్ అభ్యర్థులు సైతం గెలుపొందారు. కేజీహెచ్ క్లాక్ టవర్ ప్రాంగణంలో బుధవారం ఎన్నికలు నిర్వహించారు, ఆరేళ్ల తరువాత ఈ ఎన్నికలు రాజకీయ పక్షాలను తలపించేలా పోలీసు బందోబస్తు మధ్య హోరాహోరీగా జరిగాయి. ఉమ్మడి విశాఖ జిల్లా వ్యాప్తంగా మొత్తం 555 మంది ఓటర్లలో 521 మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. అనకాపల్లి, నర్సీపట్నం, అరుకు, పాడేరు సహా వివిధ ప్రాంతాల నుంచి నర్సింగ్ సిబ్బంది వచ్చి తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. అధ్యక్ష పదవికి పోటీపడిన టి.గంగాభవానీ, వి.ఉషారాణిలు తమ ప్యానల్ సభ్యులుగా తొమ్మిది మంది చొప్పున రంగంలోకి దింపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నిలు నిర్వహించి, అనంతరం ఓట్లు లెక్కించి ఫలితాలు వెల్లడించారు. ఈ ఎన్నికల్లో టి.గంగా భవానీ 336 ఓట్లు సాధించి జిల్లా సంఘ అధ్యక్షురాలిగా గెలుపొందారు. కార్యదర్శిగా జి.వి.ఎస్ వరలక్ష్మి (319 ఓట్లు), కోశాధికారిగా బుద్ధరాజు వంశీ (329 ఓట్లు)లు విజేతలయ్యారు. ఈసీ సభ్యులుగా ఎస్.మెహర్ శాంతి, వియ్యపు వినీలా, దాసరి లిల్లీ గ్రేస్, ఎస్ .గంగాగౌరీ, టి.పద్మజలు ఎన్నికయ్యారు.

రైల్వేస్టేషన్లలో హెల్ప్‌లైను నంబర్లు

తుఫాన్ హెచ్చరికల నేపథ్యం

యంత్రాంగాన్ని సిద్ధంచేసిన వాల్తేరు డీఆర్ఎం



అధికారులు, సిబ్బందికి ఏర్పాట్లపై సూచనలిస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

విశాఖపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): దానా తుఫాన్ తీవ్ర ప్రభావ హెచ్చరికల నేపథ్యంలో వాల్తేరు డివిజన్ ప్రత్యేక ముందస్తు సన్నాహక భద్రత చర్యలు చేపట్టింది. బుధవారం డీఆర్ఎం సౌరబ్‌ప్రసాద్ శ్రీకాకుళం రోడ్డు స్టేషన్‌లో పర్యటించి ఏర్పాట్లపై సమీక్షించారు. ట్రాక్‌లు, విద్యుదీకరణ, సిగ్నలింగ్ వ్యవస్థలపై సంబంధిత అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. తుఫాన్ కారణంగా ఏమైనా దెబ్బతింటే యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. డీజిల్ లోకోమోటివ్‌లను సిద్ధంగా ఉంచుకుని విద్యుత్ వైఫల్య సమయంలో ఉపయోగించుకోవాలని సూచించారు. రైళ్ల రాకపోకలు సాఫీగా జరిగేందుకు ట్రాక్‌లపై ఎప్పటికప్పుడు పెట్రోలింగ్ నిర్వహించాలని, పెట్రోలింగ్ మెన్ విధుల నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించి ప్రమాదాలు, అంతరాయాలను గుర్తించి తక్షణమే సమాచారమివ్వాలన్నారు. పూర్తి స్థాయి పరికరాలతో ఇంజినీరింగ్ రిలీఫ్ వ్యాన్‌లను సిద్ధంగా ఉంచాలని, ప్రసార వ్యవస్థ ద్వారా రైళ్ల రాకపోకలపై ప్రయాణికులను అప్రమత్తం చేయడంతోపాటు ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. వాల్తేరు డివిజన్ పరిధిలోని అన్ని స్టేషన్లలో వైద్య సదుపాయ బృందాలను ఏర్పాటు చేయాలని, వాతావరణ శాఖ హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్టేషన్లలో హెల్ప్ డెస్క్‌లతోపాటు టికెట్లు రద్దు చేసుకునేవారికి సౌకర్యవంతంగా అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. సివిల్ డిఫెన్స్, స్కౌట్స్ అండ్ గైడ్స్ వలంటీర్లు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ పర్యటనలో ఏడీఆర్ఎంలు సుధీర్‌కుమార్ గుప్తా, మనోజ్‌కుమార్ సాహు, ఇతర అధికారులు పాల్గొన్నారు. హెల్ప్ లైను నంబర్లు: విశాఖ రైల్వేస్టేషన్...0891-2746330, 0891-2744619, 8712641255, 7780787054, విజయనగరం; 08922-221202, 8712641260; శ్రీకాకుళం రోడ్డు; 08942-286213, 08942-286245; దువ్వాడ; 8500358524; రాయగడ; 06856223400, 9439741071

కథలు ఉత్సుకత కలిగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రముఖ రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు

సీతంపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కథలు పాఠకుడికి ఉత్సుకత కలిగించేలా ఉండాలని, ఏ కథ అయితే మళ్లీ మళ్లీ చదివించి పదేళ్ల తర్వాత కూడా చదివిస్తుందో అదే మంచి కథ అన్ని ప్రముఖ రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు అభివర్ణించారు. సీతంపేట రాజేంద్రనగర్‌లో గల ప్రిజమ్ కళాశాల్లో సహృదయ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ అధ్యక్షతన కథాకచేరి, కథకుల వైవిధ్యమైన కథలు అనే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా విచ్చేసిన ప్రముఖ రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు మాట్లాడుతూ సామాజిక రుగ్మతలపై మనో విశ్లేషణలు వివరించే మంచి కథలు రచయితల నుంచి రావాలన్నారు. సాహితీవేత్తల పరిచయంలో భాగంగా పరమాత్ముని శివరాం రచించిన 'స్వప్నం రాసిన అమృత' విశేషాలను డాక్టర్ కె.జి. వేణు విశ్లేషించారు. డాక్టర్ సూరపనేని విజయకుమార్, పలువురు రచయితలు, కథకులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ కాలనీలో పోలీసుల కార్డన్ సెర్చ్



ఓ ఇంట్లో తనిఖీలు చేస్తున్న పోలీసు అధికారి

మర్రిపాలెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు వెస్ట్ సబ్ డివిజన్ ఎయిర్‌పోర్ట్ పోలీసుస్టేషన్ సీఐ చక్రధరరావు నేతృత్వంలో మాధవధార అంబేడ్కర్‌కాలనీలో బుధవారం పోలీసులు కార్డన్ సెర్చ్ చేపట్టారు. తనిఖీల్లో భాగంగా పలు ఇళ్లలో సోదాలు నిర్వహించారు. అనంతరం కాలనీ విజిబుల్ పోలీసింగ్, గ్రామసభ నిర్వహించి సీసీ కెమెరాల ఏర్పాటు ప్రాముఖ్యతను వివరించారు. ఎవరూ చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొనకుండా ప్రశాంతంగా జీవించాలన్నారు. సరైన ధ్రువపత్రాలులేని పది వాహనాలను స్వాధీనపరుచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎయిర్‌పోర్ట్, కంచరపాలెం పోలీసుస్టేషన్ల ఎస్సైలు రామకృష్ణ, దివ్యభారతి, గోపాలపట్నం ఎస్సై రామకృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఏయూ ఖ్యాతి నిలపండి: వీసీ



సెమినార్ హాలు నిర్మించిన శ్రీధర్‌తో సంభాషిస్తున్న వీసీ శశిభూషణరావు

విశాఖపట్నం (స్పోర్ట్సు), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడారంగంలో రాణించేందుకు వర్సిటీ యాజమాన్యం కల్పించిన మౌలిక సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య శశిభూషణరావు పేర్కొన్నారు. ఏయూ ఇండోర్ స్పోర్ట్సు హాల్లో స్పోర్ట్సు బోర్డు నిర్వహిస్తున్న అంతర్ కళాశాలల మహిళల కబడ్డీ చాంపియన్‌షిప్ టోర్నీకి ఆయన ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారిణులను పరిచయం చేసుకుని అభినందించారు. వీసీ మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయి టోర్నీల్లో రాణించి ఏయూ ఖ్యాతిని నిలబెట్టాలని సూచించారు.

మహిళల కబడ్డీ టోర్నీలో ఏయూ అనుబంధ కళాశాలల నుంచి సుమారు 250 మంది విద్యార్థినులు పాల్గొనడం ఆహ్వానించదగ్గ విషయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏయూ స్పోర్ట్సు బోర్డు కార్యదర్శి ప్రొఫెసర్ ఎస్.విజయ్‌మోహన్, బ్యూటిఫికేషన్ డీన్ ధనరాజ్, ఏయూ కోచ్ కృష్ణారెడ్డి, వీఎస్ కృష్ణా కాలేజి ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ జివెంకటేశ్వరరావు, డాక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సెమినార్ హాలు నిర్మాణం అభినందనీయం

ఆంధ్ర విశ్వవిద్యాలయం సిల్వర్ జూబ్లీ క్రీడా మైదానం ప్రాంగణంలో మాజీ వాలీబాల్ కోచ్ శ్రీరామినేని కోదండరామయ్య పేరుతో నిర్మించిన సెమినార్ హాలును వీసీ ఆచార్య శశిభూషణరావు బుధవారం పరిశీలించారు. కోదండరామయ్య కుమారుడు శీరామినేని శ్రీధర్‌ను అభినందించారు. సుమారు 250 కుర్చీల సామర్థ్యం, సెంట్రల్ ఏసీ సౌకర్యంతో నిర్మించిన ఈ హాలు ఎంతో ఉపయోగకరమన్నారు. స్పోర్ట్సు బోర్డు కార్యదర్శి ఎన్.విజయ్‌మోహన్, కోదండరామయ్య కుమారులు శ్రీరామినేని శ్రీధర్, శివలింగప్రసాద్ పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం

విశాఖపట్నం (స్పోర్ట్సు), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) జిల్లా స్థాయి అండర్-14, 17 బాలురు, బాలికల బాస్కెట్‌బాల్ పోటీలు కమ్ రాష్ట్ర స్థాయి టోర్నీకి ఎంపికలు బుధవారం ప్రారంభమయ్యాయి. సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో జరుగుతున్న ఈ పోటీలకు పినాకల్ హాస్పిటల్స్ డైరెక్టర్ కె.నివేదిత ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పోటీల్లో జిల్లా వ్యాప్తంగా సుమారు 200 మంది పాల్గొనడం విశేషమని, చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యతనివ్వడం అభినందనీయమని పేర్కొన్నారు. బాస్కెట్‌బాల్ సీనియర్ కోచ్ బొజ్జా రామయ్య శేషగిరిరావు పాల్గొనగా, జిల్లా జట్టు సెలక్షన్ కమిటీ సభ్యులుగా రామచంద్రరావు, జగదీష్, భవానీ, శ్రీనివాస్, తబిత వ్యవహరించారు.

పర్యావరణ అంచనాల కమిటీలో ఉత్తరాంధ్ర నుంచి ముగ్గురికి చోటు

విశాఖపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పరిశ్రమలు, ఇతర సంస్థల ఏర్పాటుకు సంబంధించి రాష్ట్ర స్థాయి పర్యావరణ అంచనాల కమిటీలో సభ్యులుగా ఉత్తరాంధ్ర నుంచి ముగ్గురికి చోటు లభించింది. మూడేళ్లపాటు కమిటీలో కొనసాగేందుకు వీలుగా ఏయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.గిరిజాశంకర్, శ్రీకాకుళం అంబేడ్కర్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య పీలా సుజాత, ఎండాడకు చెందిన జి.వీరవెంకట సత్యనారాయణ చౌదరిని నియమించారు. ఈ మేరకు కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ సందర్భంగా గిరిజాశంకర్‌ను వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు అభినందించారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ ఎస్.కిశోర్‌బాబు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎన్ ధనుంజయరావు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.నరసింహారావు, డీసీఎంఎస్ హెచ్‌వోడీ జాలాది రవి తదితరులు పాల్గొన్నారు.

క్లాప్ కథేంటి?

... 5వ పేజీ తరువాయి

కేటాయించిన వార్డు సచివాలయ పరిధిలోని అన్ని ఇళ్లకు తిరిగి చెత్తను సేకరించాలి. దీనికోసం ఒక్కో వాహనం మూడు ట్రిప్పులు తిరగాలి. అయితే కొన్ని వాహనాల డ్రైవర్లు వార్డు సచివాలయ పరిధిలో ఒక్క ట్రిప్పు మాత్రమే తిరుగుతున్నారు. మరికొన్ని వాహనాల డ్రైవర్లు అయితే ట్రిప్పులను లెక్క చూపించుకునేందుకు కొద్దిపాటి చెత్తలోడుతోనే గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లకు వెళ్లి వచ్చేస్తున్నారు. దీనివల్ల రికార్డులో ట్రిప్పులు లెక్క సరిపోతున్నాసరే సంబంధిత వార్డు సచివాలయ పరిధిలోని అన్ని ఇళ్ల నుంచి చెత్తసేకరణ జరగడం లేదు. వారంలో రెండు, మూడు రోజులు మాత్రమే క్లాప్ వాహనం ఇళ్లకు వస్తుండడంతో మిగిలిన రోజుల్లో చెత్తను ప్రజలు రోడ్లపైకి తీసుకువచ్చి పడేస్తున్నారు. దీనివల్ల రోడ్లపై ఎక్కడికక్కడ చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. రోడ్లపై తిరిగే ఆవులు, కుక్కలు చెత్తకుప్పలను ఛిన్నాభిన్నం చేస్తుండడంతో అంతా చెత్తమయం అవుతోంది. ఇది అపారిశుధ్యానికి దారితీస్తోంది.

క్లాప్ వాహనాలన్నీ పక్కాగా తిరగాల్సిందే

జీవీఎంసీ నిధులు ఖర్చు పెడుతున్నప్పటికీ పరిశుభ్రత మెరుగుపడకపోవడంపై కమిషనర్ సంపత్‌కుమార్ తీవ్ర అసహనం వ్యక్తంచేసినట్టు తెలిసింది. ఇకపై క్లాప్ వాహనాలన్నీ తమకు కేటాయించిన వార్డు సచివాలయం పరిధిలో రోజూ చెత్త సేకరణ చేయాల్సిందేనని అధికారులను ఆదేశించినట్టు తెలిసింది. ముందుగా 578 క్లాప్ వాహనాలన్నీ వీధుల్లో తిరిగేలా చూడాలని ఆదేశించినట్టు సమాచారం. రెండో దశలో వాహనాల జీపీఎస్‌లను పక్కాగా సేకరించాలని, ప్రతిరోజూ ఆ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదుచేయాలని ప్రజారోగ్య విభాగం అధికారులకు సూచించినట్టు తెలిసింది. చివరగా ప్రతి వాహనం ఒకట్రిప్పులో కనీసం 1.5 టన్నులు చెత్తను కచ్చితంగా తీసుకువెళ్లేలా చేసేందుకు గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో వేయింగ్ మిషన్ రీడింగ్‌ను ఆన్‌లైన్‌లో నమోదుచేయించాలని స్పష్టంచేసినట్టు తెలిసింది. ఆ డేటా ఆధారంగా వాహనం పనితీరు సంతృప్తికరంగా ఉందా?, లేదా? అనేది అదనపు కమిషనర్, ప్రధాన వైద్యాధికారి, మెకానికల్ ఈఈలు సంయుక్తంగా నిర్ధారించిన తర్వాతే బిల్లు చెల్లింపునకు ప్రతిపాదన పంపించాలని కమిషనర్ ఆదేశించినట్టు తెలిసింది. ఇలా చేయగలిగితే క్లాప్ వాహనాలతో పూర్తిస్థాయిలో పని చేయించుకోవడంతోపాటు నగరంలో పరిశుభ్రత మెరుగుపరచడానికి అవకాశం కలుగుతుందని కమిషనర్ అభిప్రాయపడినట్టు ప్రజారోగ్యం విభాగం అధికారులు చెబుతున్నారు.

రోడ్ల నిర్వహణకు గ్లోబల్ టెండర్స్?

... 5వ పేజీ తరువాయి

మరమ్మతులు, లేయర్ వేయాల్సిన వాటి వివరాలతో జాబితాను రూపొందించి, అంచనాలను బట్టి టెండర్ పిలిచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించినట్టు సమాచారం. రోడ్డు పాడైన వెంటనే మరమ్మతులు చేయడం, అవసరమైన సందర్భాల్లో శాస్త్రీయంగా తారు, పిక్క హాట్‌మిక్సింగ్ చేసి కొత్త లేయర్ వేయడం పనులను ఆయా సంస్థలకు అప్పగించాలనేది కమిషనర్ భావన. ఆసక్తి గల సంస్థల నుంచి ఆసక్తి వ్యక్తీకరణ (ఈఓఐ), పనులు చేయడానికి ఎంత ఖర్చవుతుందని భావిస్తున్నారో రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్ఎఫ్‌పీ) తీసుకోవాలని ఆదేశించారు. ఆర్ఎఫ్‌పీలో ఆయా పనులను ఎంత తక్కువ ఖర్చుతో చేయవచ్చో పేర్కొంటూ ఇచ్చే నివేదిక ఆధారంగా గ్లోబల్ టెండర్లు పిలిచే అవకాశం ఉందని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు.

ఏయూలో పరీక్ష ఫీజు తగ్గింపు

... 5వ పేజీ తరువాయి

ఇతర ఉన్నతాధి కారులతో చర్చించి కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం ఉన్న పరీక్ష ఫీజులో రూ.450 తగ్గించాలని నిర్ణయం తీసుకున్న అధికారులు వెంటనే అమలు చేయాలని ఆదేశాలు జారీచేశారు. ప్రస్తుతం ఆర్ట్స్ కాలేజీ పరిధిలో వివిధ కోర్సుల్లో చదువుతున్న విద్యార్థులకు సెమిస్టర్ పరీక్ష ఫీజు రూ.1,250. సైన్స్‌తోపాటు ఇతర కాలేజీల విద్యార్థుల పరీక్ష ఫీజు రూ.1350. ఈ మొత్తంలో రూ.450 తగ్గించనున్నారు. అలాగే పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఉన్న గడువును కూడా అధికారులు నవంబరు రెండో తేదీ వరకు పొడిగిస్తూ ఆదేశాలు జారీచేశారు. దీనిపై వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు మాట్లాడుతూ విద్యార్థులు సమస్యను తన దృష్టికి తీసుకువచ్చారని, అధికారులతో చర్చించి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. వర్సిటీలో స్నేహ పూర్వకమైన వాతావరణాన్ని కల్పించామని, అందుకే విద్యార్థులు తమ ఇబ్బందులను నేరుగా వచ్చి తమకు తెలియజేస్తున్నారన్నారు. విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడంతోపాటు పటిష్ఠమైన, నాణ్యమైన విద్యా బోధన జరిగేలా చూస్తున్నామన్నారు.

కానరాని సమస్యల పరిష్కారం

... 5వ పేజీ తరువాయి

సమావేశానికి హాజరవుతున్నారు. ప్రతి సమావేశంలో ఐదారు శాఖలపై గంటలకొద్దీ సమీక్షలు నిర్వహిస్తున్నారు. కానీ ప్రయోజనం మాత్రం ఉండడం లేదనే వ్యాఖ్యలు సభ్యుల నుంచి వినిపిస్తున్నాయి.

వ్యవసాయం, విద్య, వైద్యం, డ్వామా, పంచాయతీరాజ్, హౌసింగ్, డీఆర్‌డీఏ, పౌరసరఫరాలు, పశు సంవర్థక, గనులు, రవాణా వంటి శాఖలు తప్ప కొన్ని శాఖలపై ఇప్పటివరకూ అసలు చర్చే చేపట్టలేదు. ఒకటి, రెండు పర్యాయాలు అటవీ శాఖపై ఏజెన్సీ ప్రజాప్రతినిధులు విరుచుకుపడ్డారు. అయినా ఫలితం శూన్యం. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం రెండు వరకు సమావేశం నిర్వహిస్తున్నారు. భోజన విరామం తరువాత చాలామంది సభ్యులు ఇంటి ముఖం పడుతున్నారు.

అసలు సమావేశం నిర్వహణకు సరైన విధంగా కసరత్తు చేయడం లేదనే వాదన ఉంది. సాధారణంగా ముందు షాడో సమావేశం నిర్వహించి ప్రతిసారి కొత్త అంశాలపై చర్చించేలా నిర్ణయం తీసుకోవాలి. ఒకే అంశంపై సభ్యులంతా మాట్లాడే కంటే అంశాల వారీగా సభ్యులు సమస్యలు లేవనెత్తితే సమయం ఆదా అవుతుంది. అయితే ఆ దిశగా చొరవ చూపడం లేదని కొందరు సభ్యులు వ్యాఖ్యానిస్తున్నారు. అలాగే ఒకసారి లేవనెత్తిన సమస్యలు మరోసారి ప్రస్తావనకు రాకుండా పరిష్కరించాలన్న ఆలోచన అధికార యంత్రాంగంలో కూడా కనిపించడం లేదు. గ్రామీణ, ఏజెన్సీలో ఇళ్ల నిర్మాణాల బిల్లులు మంజూరుపై దాదాపు రెండేళ్ల నుంచి సభ్యులు అడుగుతున్నా పరిష్కారం లభించడం లేదు. అలాగే ఏజెన్సీలో విద్య, వైద్య సదుపాయాలు, హాస్టళ్లు, విత్తనాలు సరఫరా, తదితర సమస్యలను ప్రతిసారి సభ్యులు ప్రస్తావిస్తున్నా ఫలితం ఉండడం లేదు. పరవాడ మండలం తానాం గ్రామంలో జల వనరుల శాఖ చేపట్టాల్సిన పనులను గ్రామీణ నీటి సరఫరా విభాగం చేపట్టడం, అందుల్లో నాణ్యత లేకపోవడంపై జడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజు ఏడాది నుంచి ప్రస్తావిస్తూనే ఉన్నారు. బహుశా గురువారం సమావేశంలోనూ చర్చించే అవకాశం ఉంది. అనంతగిరిలో క్షతగాత్రులను ఎస్.కోట నుంచి విశాఖకు తరలించాలని, విజయనగరం ఆస్పత్రికి వద్దని జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు రెండేళ్ల నుంచి కోరుతున్నా ఇంతవరకూ పట్టించుకున్న దాఖలాలు లేవు. జిల్లాలో రోడ్ల దుస్థితి, ఇసుక సరఫరా, ఖరీఫ్‌కు నీటి విడుదల వంటి అంశాలపై గురువారం నాటి సమావేశం దృష్టిసారించాలని పలువురు సభ్యులు కోరుతున్నారు. సమస్యలపై మాటలతో సరిపెట్టకుండా పరిష్కారం అయ్యే దిశగా చొరవ తీసుకోవాలంటున్నారు.

దుర్భరంగా పాత అగనంపూడి కోనేరు

- పిచ్చిమొక్కలు, తుప్పలతో నిండిన వాకింగ్ ట్రాక్
- విష సర్పాల సంచారంతో అక్కడకు వెళ్లేందుకు భయాందోళన చెందుతున్న ప్రజలు
- జీవీఎంసీ అధికారులు నిర్వహణ గురించి పట్టించుకోకపోవడం వల్లే ఈ దుస్థితి నెలకొందన్న విమర్శలు





తుప్పలతో నిండిన పాత అగనంపూడి కోనేటి పరిసరాలు. (ఇన్‌సెట్లో) వాకింగ్ ట్రాక్‌లో పేరుకుపోయిన ముళ్లపొదలు

అగనంపూడి, అక్టోబరు 23:
జీవీఎంసీ 79వ వార్డు పరిధి పాత అగనంపూడి కోనేరు అధ్వానంగా మారింది. జీవీఎంసీ అధికారులు నిర్వహణ పనులు చేపట్టిక పోవడంతో చెరువంతా ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలతో నిండిపోయింది. చెరువుల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా 2018లో అప్పటి ప్రభుత్వ హయాంలో రూ.34 లక్షలు వెచ్చించి ఇక్కడి కోనేరును సుందరంగా తీర్చిదిద్దారు. ఇందులో భాగంగా వర్షపు నీరు చెరువులోకి వచ్చే విధంగా డ్రైనేజీలను ఏర్పాటు చేయడంతో పాటు గట్టు మొత్తాన్ని రాళ్లను పేర్చి బలోపేతం చేశారు. అంతేకాకుండా స్థానికులు వాకింగ్ చేసుకునేందుకు వీలుగా ట్రాక్‌ను నిర్మించారు. అలాగే చుట్టూ స్తంభాలను ఏర్పాటు చేసి లైట్లను అమర్చడంతో స్థానికులు వాకింగ్ చేసుకునేందుకు ఎంతో అనువుగా ఉండేది. దీంతో ఉదయం, సాయంత్రం వృద్ధులు ఇక్కడి కూర్చోని కాలక్షేపం చేసేవారు. కాగా గత కొన్ని నెలలుగా జీవీఎంసీ అధికారులు ఈ కోనేరు గురించి పట్టించుకోపోవడంతో ప్రస్తుతం పిచ్చిమొక్కలతో దారుణంగా దర్శనమిస్తోంది. చెరువు గర్భంతో పాటు వాకింగ్ ట్రాక్ చుట్టూ పెద్ద పెద్ద ముళ్లపొదలు, తుప్పలు ఏపుగా పెరిగిపోయాయి. చుట్టూ ఉన్న లైట్లు కూడా పడకేశాయి. విష సర్పాల తాకిడి అధికంగా ఉండడంతో స్థానికులు ఇక్కడకు వచ్చేందుకు భీతిల్లుతున్నారు. ప్రస్తుతం ఈ కోనేరు మందుబాబులకు అడ్డగా మారింది. చీకటి పడితే చాలు ఎక్కడెక్కడి నుంచో మందుబాబులు ఇక్కడకు విచ్చేసి మద్యం సేవిస్తున్నారు. జీవీఎంసీ అధికారులు ఈ చెరువు నిర్వహణ పట్ల చిన్నచూపు చూడడం వల్లే ఈ దుస్థితి నెలకొందని పలువురు విమర్శిస్తున్నారు. అందువల్ల తక్షణమే వారు స్పందించి చెరువుతో పాటు పరిసరాల్లో నిర్వహణ పనులు చేపట్టి తమకు అందుబాటులోకి తెచ్చేందుకు తగిన చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

తక్షణమే నిర్వహణ పనులు చేపట్టాలి

-బొబ్బరి నాగు, పాత అగనంపూడి



నిర్వహణ పనులు చేపట్టకపోవడం వల్లే పాత అగనంపూడి కోనేరు అధానంగా మారింది. చెరువు గర్భంతో పాటు పరిసర ప్రాంతాలు పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. లైట్లు కూడా వెలగడం లేదు. విష సర్పాల తాకిడి ఎక్కువగా ఉండడంగా ఉండడంతో ఇక్కడకు వచ్చేందుకు భయపడుతున్నాం. గతంలో వాకింగ్ చేసుకునేందుకు ఎంతో వీలుగా ఉండే ఈ ప్రాంతం ఇప్పుడు దుర్భరంగా మారడం బాధాకరం. జీవీఎంసీ అధికారులు చొరవ తీసుకుని తక్షణమే నిర్వహణ పనులు చేపట్టాలి.



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

26 నుంచి టీడీపీ సభ్యత్వ నమోదు

'గాజువాక'లో 80 వేల సభ్యత్వాలు చేసి సీఎం చంద్రబాబుకు బహుమతిగా ఇవ్వాలి

నాయకులు, కార్యకర్తలకు సూచించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

గాజువాక, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదును ఈ నెల 26వ తేదీ నుంచి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడతామని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎనభై వేల మంది పార్టీ సభ్యత్వం తీసుకునేలా చూడాలని, రాష్ట్రంలోనే అత్యధికంగా సభ్యత్వ నమోదులు చేపట్టి సీఎం చంద్రబాబునాయుడుకు బహుమతిగా ఇవ్వాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. సభ్యత్వం ద్వారా వచ్చే నగదును కార్యకర్తల సంక్షేమ నిధికి తరలించి, దురదృష్టవశాత్తు మృతి చెందిన కార్యకర్తల కుటుంబానికి రూ.ఐదు లక్షల బీమా సదుపాయం కల్పించేలా చూస్తామన్నారు. ఎన్నికల్లో టీడీపీ విజయానికి ఎంతో కృషి చేసిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు లభిస్తుందని పల్లా శ్రీనివాస్ పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు గొర్లె వెంకునాయుడు, మహ్మద్ రఫీ, నాయకులు బలగ బాలునాయుడు, విల్లా రామ్మోహన్‌కుమార్, శివ ప్రసాద్, గోమాడ వాసు, సర్వసిద్ధి అనంతలక్ష్మి, దళేంద్ర, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని 'పల్లా'కు వినతి

పెదగంట్యాడ, అక్టోబరు 23: జీవీఎంసీ 75వ వార్డు పరిధి ఎన్టీఆర్ జంక్షన్‌లో షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని కోరుతూ సీతానగరం గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు బుధవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. సీతానగరం సచివాలయం వెనక, ఎన్టీఆర్ జంక్షన్‌కు ఎదురుగా కాలనీకి సంబంధించిన స్థలం ఉందని, అక్కడ కమర్షియల్ కాంప్లెక్స్‌ను నిర్మిస్తే కొంతమంది నిర్వాసిత నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. అలాగే సీతానగరంలో సెల్ టవర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు జరుగుతున్నాయని, దీనిని వేరే ప్రాంతంలో ఏర్పాటు చేసేలా చూడాలని కోరారు. పల్లాను కలిసిన వారిలో కమిటీ ప్రతినిధులు ఎన్.దుర్గబాబు, పల్లా హరి, టీడీపీ వార్డు అధ్యక్షుడు నమ్మి అప్పారావు, ఇంటక్ నాయకుడు కురందాసు వంశీకృష్ణ, తదితరులు ఉన్నారు.

షెడ్యూల్ ప్రకారమే ఆర్టీసీ బస్సులను నడపాలి: ఆర్ఎం

పెదగంట్యాడ, అక్టోబరు 23: డిపోకు సంబంధించిన అన్ని బస్సులను షెడ్యూల్ ప్రకారమే నడపాలని ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పల నాయుడు అధికారులకు సూచించారు. ఆర్టీసీ గాజువాక డిపో, లాజిస్టిక్ పాయింట్లను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన డిపో, గ్యారేజీ, అధికారులతో మాట్లాడుతూ షెడ్యూల్‌లో నిర్దేశించిన సమయానికే బస్సులను నడపడం వల్ల ప్రయాణికులకు ఆర్టీసీపై నమ్మకం పెరుగుతుందన్నారు. ప్రయాణికుల పట్ల సిబ్బంది మర్యాదగాపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. పార్శిళ్ల బుకింగ్, డెలివరీల్లో ఎటువంటి జాప్యం జరగకుండా చూడాలన్నారు.

వైభవంగా ముగిసిన పైడితల్లమ్మ పండగ



ఆటోనగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 70వ వార్డు పరిధి శ్రీనివాస నగర్, ఎర్రగడ్డ కాలనీ, శ్రామిక నగర్ గ్రామాల ప్రజల ఇలవేల్పు పైడితల్లమ్మ పండగ ముగింపు ఉత్సవాలను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ, గ్రామ కమిటీల ఆధ్వర్యంలో అమ్మవారికి మేలుకొలుపు, పంచామృతాభిషేకాలు, పూజలను అర్చకులు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పైడితల్లమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయ ప్రాంగణం వద్ద పరస నిర్వహించారు. సాయంత్రం చేపట్టిన అమ్మవారి ఊరేగింపులో కాళీమాత, వేషధారులు, కోబ్రా డ్యాన్స్‌లు, కోలాటాలు, నేలవేషాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, బాణసంచా కాల్పులు అందరినీ ఆకట్టుకున్నాయి.

నేటి నుంచి 'ఉక్కు'లో బాణసంచా విక్రయాలు

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ కో-ఆపరేటివ్ స్టోర్స్ ఆధ్వర్యంలో గురువారం నుంచి బాణసంచా విక్రయాలు ప్రారంభిస్తున్నట్టు స్టోర్స్ అధ్యక్షుడు డీవీ నాగబాబు, కార్యదర్శి ఆకుల నూకరాజు తెలిపారు. స్టోర్స్ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటులో ప్రస్తుత ఆర్థిక స్థితిని అయ్యన్స్ సంస్థకు వివరించడంతో గత ఏడాది కంటే ఈసారి తక్కువ ధరకు బాణసంచాను సరఫరా చేశారన్నారు. సీడబ్ల్యూసీ-1లో రోజూ ఉదయం 9 నుంచి రాత్రి 8.30 గంటల వరకు బాణసంచా విక్రయిస్తామని, ఉక్కు ఉద్యోగుల కోసం ఏడు కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఉపాధ్యక్షుడు జి.నాగభూషణం, డైరెక్టర్లు బీటీ జగదీశ్, ఏవీ జగదీశ్వరరావు, ఏవీ సత్యనారాయణ, లోకేశ్, భాను, తదితరులు పాల్గొన్నారు.

'ఆయుష్మాన్ భారత్ కార్డులు మంజూరు చేయాలి'

గాజువాక, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల కుటుంబ సభ్యులకు రూ.ఐదు లక్షల విలువైన ఆయుష్మాన్ భారత్ కార్డులను మంజూరు చేయాలని మంగళవారం జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో వైద్యాధికారి కిరణ్‌ను బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు కోరారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డుల మంజురులో తీవ్ర జాప్యం జరుగుతుందని, అర్హులైన ప్రతిఒక్కరికీ కార్డులు ఇవ్వాలనారు. ఆయన వెంట నాయకులు రాజశేఖర్, మనోహర్ ఉన్నారు.

కిమ్స్‌లో వృద్ధురాలికి అరుదైన శస్త్ర చికిత్స

అక్కిరెడ్డిపాలెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలతో రక్తనాళాలు ఉబ్బడం (ఎన్యూరిజం)తో బాధ పడుతున్న ఓ వృద్ధురాలికి షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స చేయడంతో ఆమె కోలుకుంది. తెలుగు రాష్ట్రాల్లోనే తొలిసారిగా ట్రెన్నా అనే పరికరాన్ని వినియోగించి ఈ శస్త్ర చికిత్స చేసినట్టు డాక్టర్ పోతుల వెంకటేశ్ బుధవారం తెలిపారు. విజయనగరానికి చెందిన వృద్ధురాలు (64) తీవ్రమైన తలనొప్పి, కాళ్లు, చేతుల తిమ్మిరెక్కడం వంటి సమస్యలతో చికిత్స నిమిత్తం ఇక్కడి కిమ్స్ ఆస్పత్రిలో చేరారు. ఆమెను పరీక్షించిన ప్రముఖ న్యూరో అండ్ ఇంటర్వెన్షనల్ రేడియోలజిస్టు డాక్టర్ వెంకటేశ్ మెదడులోని రక్తనాళాలు ఉబ్బినట్టు గుర్తించారు. ఈ మేరకు వైద్య సిబ్బందితో ట్రెన్నా పరికరంతో అధునాతన పద్ధతిలో శస్త్ర చికిత్స చేయడంతో వృద్ధురాలు ప్రస్తుతం సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నట్టు డాక్టర్ వెంకటేశ్ పేర్కొన్నారు.

వైభవంగా ఉమామహేశ్వరుల కల్యాణం

అగనంపూడి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడకలోనరి శ్రీఉమామహేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరుల కల్యాణాన్ని వైభవంగా జరిపారు. అలాగే హోమం, రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధనను చేపట్టారు. సాయంత్రం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



పార్థసారథికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏఈలు, సిబ్బంది

డీఈఈగా పార్థసారథి బాధ్యతలు స్వీకరణ

ఆటోనగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈపీడీసీఎల్ ఆటోనగర్ డీఈఈగా విధులు నిర్వర్తించిన ఎ.పార్థసారథి బుధవారం గాజువాక డీఈఈగా బాధ్యతలు చేపట్టారు. ఆయనను గాజువాక, ఆటోనగర్, పెదగంట్యాడ, వడ్లపూడి, కూర్మన్నపాలెం ప్రాంతాలకు చెందిన ఏఈలు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన సేవలందించేందుకు కృషి చేస్తానన్నారు. 'దానా' తుఫాన్ దృష్ట్యా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఆయనను కలిసిన వారిలో ఏఈలు రాయుడు, వెంకటరామకృష్ణ, రాజేంద్రప్రసాద్, ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది ఉన్నారు.

ఫంక్షన్ హాల్‌గా మారిన వైసీపీ కార్యాలయం

మల్కాపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గం పరిధిలోని ఏడు వార్డుల (40, 58 నుంచి 63) కు చెందిన వైసీపీ కార్యాలయాన్ని ఫంక్షన్ హాల్‌గా మార్చేశారు. కార్యాలయం దుస్థితిని చూసిన కార్యకర్తలు ఆవేదన చెందుతున్నారు. కార్యాలయాన్ని ఈ ఏడాది జరి గిన సార్వత్రిక ఎన్నికలకు ముందు నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్తగా ఉన్న ఆడారి ఆనంద్‌కుమార్ గాజువాక ఆర్టీసీ డిపో సమీపంలో పారిశ్రామిక ప్రాంతం వైసీపీ కార్యాలయంగా నామకరణం చేసి ప్రారంభించారు. ఏడు వార్డులకు సంబంధించిన సమావేశాలను ఇక్కడే ఏర్పాటు చేసేవారు.

ఎన్నికల్లో వైసీపీ ఓటమి పాలైన తరువాత ఆనంద్ కుమార్ నియోజకవర్గాన్ని పట్టించుకోవడం మానేశారు. దీంతో తొలుత కొద్ది రోజు ల పాటు కార్యాలయానికి తాళాలు వేయగా, ప్రస్తుతం పూసర్ల బుచ్చిరాజు గారి ఫంక్షన్ హాల్, గంగా కేటరింగ్ కేంద్రంగా మార్పు చేసినట్టు బోర్డు పెట్టారు. వైసీపీ కార్యాలయం అని ఉన్న బోర్డును తొలగించారు. ఇది చూసిన వైసీపీ శ్రేణులు ఆవేదనకు గురవుతున్నారు. ప్రస్తుతం పారిశ్రామిక ప్రాంతం ఏడు వార్డులకు సం బంధించి వైసీపీ కార్యాలయం లేదు. శ్రీహరిపురంలో మళ్ల విజయప్రసాద్ హయాంలో ఏర్పాటు చేసిన కార్యాలయం ఉన్నా.. ఆ కార్యాలయం కూడా ఇప్పుడు మూసేసి ఉంది. ఈ కార్యాలయంలో ఇటీవల మళ్ల తిరిగి నియోజకవర్గం సమన్వయకర్తగా బాధ్యతలు తీసుకున్న తరువాత ఏడు వార్డుల వైసీపీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఈ కార్యాలయం కూడా హోటల్‌గా మార్చే అవకాశాలు ఉన్నాయని తెలిసింది. దీంతో వైసీపీ నాయకులు ఏదైనా సభలు, సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలంటే ఏమీ చేయాలో అర్థం కానీ స్థితిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో కార్యకర్తలు ఈ ప్రాంతంలో కార్యాలయం ఏర్పాటుకు కృషి చేయాలని ప్రస్తుతం నియోజకవర్గం సమన్వయ కర్తగా ఉన్న మళ్ల విజయప్రసాద్‌పై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో ఆయన మళ్లీ ఈ ప్రాంతంలో కార్యాలయం ఏర్పా టుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు.



ఫంక్షన్ హాల్‌గా మార్చేసిన వైసీపీ కార్యాలయం ఇదే



సుజాతనగర్‌లో ధర్నా చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

ధరలను తగ్గించాలంటూ సీపీఐ ధర్నా

పెందుర్తి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : అడ్డూఅదుపు లేకుండా పెరిగిపోతున్న నిత్యావసర సరకుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సుజాతనగర్‌లో సీపీఐ నాయకులు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే నిత్యావసర సరకుల ధరలు పెరిగిపోవడంతో సామాన్యులు ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్య లు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్. శ్రీనివాసరావు, రాంబాబు, రాము, దుర్గారావు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

మల్కాపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మద్యం దుకాణాలు, బార్‌ల నిర్వాహకులు విధిగా నిబంధనలు పాటించాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని గాజువాక ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు హెచ్చరించారు. సమయపాలన లేకుండా తెర్చుకుంటున్న మద్యం దుకాణాలు అన్న శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన వార్తకు ఆయన స్పందించారు. మద్యం దుకాణాలు ఎన్ని గంటలకు తెరుస్తున్నారు ? ఎన్ని గంటలకు మూస్తున్నారు ? అన్న దానిపై నిఘా ఉంచుతామని, ఎవరైనా నిబంధనలకు వ్యతిరేకంగా తెరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో సేవలు నిల్

మల్కాపురం, అ క్టోబరు 23 : జీవీఎంసీ పరిధిలోని ఏడు వార్డులకు సంబంధించి ఏర్పాటు చేసిన బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ద్వారా వినియోగదారు లకు సేవలందడం లేదు. మల్కాపురం పోలీస్ స్టేషన్ పక్కన ఈ కార్యాలయం ఏర్పాటు చేశారు. కార్యాలయంలో ఎప్పుడు చూసినా ఒక్క ఉద్యోగి మాత్రమే ఉంటారు. మిగినవారు కనిపించిన దాఖలాలు లేదు. ఈ కార్యాలయానికి ప్రతి రోజూ వివిధ సేవల కోసం దాదాపు వంద మందికి పైగానే వస్తుంటారు. వారికి కార్యాలయంలో ఎటువంటి సేవలు లభించకపోవడంతో నిరాశతో వెను తిరుగుతున్నారు. కార్యాలయం నిర్వహణపై ఉన్నతాధికారులు దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.



మాట్లాడుతున్న జేవీ సత్యనారాయణమూర్తి

వేతన ఒప్పందం అమలు చేయాలి

మల్కాపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : కోరమాండల్ ఎరువుల కర్మాగారం యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులకు అన్యాయం చేస్తుందని కోరమాండల్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి (నాని) అన్నారు. కోరమాండల్ మెయిన్ గేటు ఎదుట యూనియన్ నాయకులు, కార్యకర్తలు బుధవారం ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడేళ్ల క్రితం జరిగిన వేతన ఒప్పందం ఇప్పటికీ అమలు చేయడం లేదని, వెంటనే వేతన సవరణ చేయాలని కోరారు. అలాగే సంస్థలో ఉన్న కేంటీన్‌లో నాణ్యమైన భోజన సదుపాయం కల్పించాలని, కాంట్రాక్టు లేబర్‌కు సీనియారిటీ ప్రకారం ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కమిటీ సభ్యులు గుడాల రాంబాబు, నాయకులు సూరిబాబు, కోరమాండల్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ ప్రతినిధులు సత్యనారాయణ రెడ్డి, కోయిలాడ శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు త్వరలోనే టిడ్కో ఇళ్లు

మల్కాపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : లబ్ధిదారులకు త్వరలోనే టిడ్కో ఇళ్లు అందజేస్తామని 60వ వార్డు టీడీపీ అధ్యక్షుడు మాతా శ్రీను తెలిపారు. వార్డు పరిధిలోని ఇందిరాకాలనీ వద్ద బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పశ్చిమ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు ఆదేశాల మేరకు లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకుడు సీతారామ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

శిల్పారామం ఏఓపై విచారణ ప్రారంభం

మధురవాడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ శిల్పారామం పరిపాలనాధికారి విశ్వనాథరెడ్డిపై ఉన్నతాధికారులు శాఖాపరమైన విచారణ ప్రారంభించారు. ఆయనపై శిల్పారామంలో పనిచేస్తున్న ఒక మహిళ పలు ఆరోపణలు చేస్తూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈమేరకు శిల్పారామం ఉన్నతాధికారులు స్పందించి, విచారణాధికారులుగా పులివెందుల శిల్పారామం ఏఓ సుధాకర్, ఫిర్యాదీదారు మహిళ కావడంతో కాకినాడ శిల్పారామంకు చెందిన మహిళా ఉద్యోగిని సరళను నియమించారు. వారు స్థానిక శిల్పారామంలో ఏఓతో పాటు ఏడుగురు ఉద్యోగులు, ఐదుగురు సెక్యూరిటీ, ఐదుగురు హౌస్ కీపింగ్ సిబ్బందిని వేర్వేరుగా విచారించి, స్టేట్‌మెంట్లు తీసుకున్నారు.

జోన్ 8 ఈఈగా చిరంజీవులు

వేపగుంట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : వేపగుంట జోన్ కార్యాలయం 8 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఎస్. చిరంజీవులు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది స్వాగతం పలికారు. జోన్ 7 నుంచి ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన రత్నాకర్‌రెడ్డి జీవీఎంసీ ప్రాజెక్టు విభాగానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా చిరంజీవులు విలేకరులతో మాట్లాడుతూ జోన్ 8లోని వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని చెప్పారు. ముఖ్యంగా జీవీఎంసీ స్థలాల్లో థీమ్ పార్కుల నిర్మాణంపై దృష్టి సారిస్తామని తెలిపారు. అలాగే వార్డుల్లో జరుగతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించి, వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

వాలిమెరకలో గ్రామ సభ



సభలో ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ ఆనంద్‌కుమార్

పెందుర్తి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలలోని వాలిమెరక జుత్తాడలో రెవెన్యూ అధికారులు భూముల రీసర్వేకు సంబంధించి బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎం. ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ రైతులు సభకు హాజరై రీసర్వేలో జరిగిన తప్పిదాలను సరిచేసుకోవాలని చెప్పారు. రీసర్వే కోసం వచ్చిన వినతులను అక్కడికక్కడే పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం రైతుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డు వాణి ప్రకాశ్, సర్వేయర్ శ్రీరామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ పుస్తకాలు వితరణ



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న ఎంఈఓ సోమేశ్వరరావు

ఎన్ఏడీ జంక్షన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ పాఠశాల నుంచి ఎన్ఎంఎంఎస్ పరీక్షకు హాజరుకానున్న విద్యార్థులకు వింగ్స్ ఫౌండేషన్ అందించిన పుస్తకాలను ఎంఈఓ సోమేశ్వరరావు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు జాతీయ స్థాయిలో మంచి ర్యాంకులు సాధించేందుకు ఈ పుస్తకాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. విద్యార్థులు పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వింగ్స్ ఫౌండేషన్ నిర్వాహకుడు ఎం.ఆనంద్, పాఠశాల హెచ్ఎం సీహెచ్ నిర్మల, ఉపాధ్యాయులు గోపీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెందుర్తి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : పెందుర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 33/11 కేవీ పులగాలిపాలెం ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు.బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, సూర్యానగర్, మర్రిచెట్లకాలనీ, నల్లక్వారీ, సాయిదివ్య లేఅవుట్, వికలాంగుల కాలనీ, కుమ్మర కాలనీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

సినిమా గైడ్

- **వేట్టయాన్:** సంగం, రమాదేవి, వెంకటేశ్వర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాల పట్నం), శ్రీకన్య కాంప్లెక్స్, లక్ష్మి (గాజువాక), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మ న్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాత (తగరపువలస)
- **విశ్వం:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య శ్రీలక్ష్మీ నరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాల పట్నం),మోహిని కాంప్లెక్స్, లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **జనక అయితే గనక:** శారద, కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజు వాక), గణేష్ (తగరపువలస)
- **మా నాన్న సూపర్ హీరో:** గోకుల్, మౌర్య (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)
- **శ్వాగ్:** శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నటరాజ్-2 (పెందుర్తి), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)
- **దేవర:** మెలోడి, జగదాంబ, శరత్, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ (తగరపు వలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 53, టమాటా 47, వంకాయలు (తెలుపు) 42, వంకాయలు (నలుపు) 60, బెండకాయలు 40, పచ్చిమిర్చి 52, కాకరకాయ 42, బీరకాయలు 30, ఆనపకాయలు 28, కాలీఫ్లవర్ 44, క్యాబేజీ 30, క్యారెట్ 58 దొండకాయలు 36, బంగాళదుంపలు 30, అరటికాయ (పెద్దది) 8, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 100, బరబాటి 44, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 36, దోసకాయలు 38, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 140, పొటల్స్ 52, కీరదోస 28, క్యాప్సికమ్ 74, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40, చిలగడదుంపలు 28, కంద 62, దేముడుచిక్కుడు 74, కొండఉసిరి 85, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, క్రపెండలం 30, మామిడి అల్లం 74, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 45.


కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	110
ఫారం ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240


కాగితంతో కళాఖండాలు











వర్షం కురిసినప్పుడు అప్పటికప్పుడు కాగితంతో పడవలు తయారుచేసి తమ ఇంటి ముందు పారే నీటిలో వాటిని వదులుతూ పిల్లలు ఆనందించడాన్ని చూస్తుంటాం. కాగితంతో పువ్వులు, ఇతర వస్తువులు తయారు చేయడం కూడా చూసే ఉంటాం. ఈ కళకు సృజనాత్మకత జోడించి కాగితపు చార్టులతో లక్షలాది రూపాయల విలువచేసే అతి ఖరీదైన కళాఖండాలు తయారుచేస్తూ విశ్వకళాకారుల్లో ఒకరిగా గుర్తింపు పొందారు మన విశాఖ వాసి మూకా సతీష్‌కుమార్.

ప్రపంచ గుర్తింపు పొందిన గోపాలపట్నం వాసి మూకా సతీష్‌కుమార్



మూకా సతీష్‌కుమార్

ఒక్కోచిత్రం ఖరీదు రూ.లక్షల్లోనే...

కాగితాలతో బొమ్మలు (పేపర్ స్కల్ప్చర్) తయారుచేయడం ఎంతో కష్టం. అటువంటి అరుదైన కళ నేర్చుకోవాలన్న తపనతో తన ఊహలకు రూపమిచ్చి కాగితపు శిల్పాలు రూపొందించి నేడు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపుపొందారు సతీష్‌కుమార్. ఈ కాగితపు శిల్పాలు చూస్తే ఎలాంటివారైనా అబ్బురపడతారు. మూకా సతీష్ చేసిన కాగితపు శిల్పాలు ప్రపంచ దేశాలకు వెళుతున్నాయి. ప్రవాస భారతీయులు (ఎన్నారై) సైతం సతీష్‌కుమార్ సృజనాత్మకతను గుర్తించి తాము ఉంటున్న దేశంలో జరిగే ఎగ్జిబిషన్‌లకు ఆహ్వానిస్తున్నారు. అమెరికాలోని తానా సభలకు కూడా సతీష్‌కుమార్‌కు ఆహ్వానం లభించడమే ఆయన ప్రతిభకు తార్కాణం.

గోపాలపట్నానికి చెందిన మూకా సతీష్‌కుమార్ ప్రైవేటు సంస్థలో ఉద్యోగి. చిన్నతనం నుంచి కాస్త వినూత్నంగా ఆలోచించే సతీష్ ఖాళీ సమయాల్లో కాగితాలను కత్తిరించి వివిధ ఆకృతుల్ని, బొమ్మల్ని తయారుచేసేవారు. ఈ తరహా కళాకారులు ఎక్కువ మంది ఉండడంతో కాస్త భిన్నంగా ఆలోచించి మందమైన కాగితపు చార్ట్‌లను దబ్బలం వంటి మందమైన చెక్కపుల్లతో అదిమి అవసరమైన చోట కత్తెర వినియోగించి బొమ్మల్ని చిత్రించడం మొదలుపెట్టారు. రాత్రింబవళ్లు తన ప్రతిభకు పదునుపెట్టడంతో అనుకున్న ఆకృతులు రూపం సంతరించుకున్నాయి. ఈ అరుదైన కాగితపు శిల్పాలు చేసే కళాకారులు ప్రపంచంలో అరుదుగా ఉన్నారని తెలుసుకున్న సతీష్‌కుమార్ తాను చేస్తున్న ఉద్యోగాన్ని విడిచిపెట్టి పూర్తిగా కాగితపు శిల్పాలపై దృష్టిపెట్టారు. తొలుత ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో నేడు ప్రపంచంలోనే పరిమితంగా ఉన్న కళాకారుల సరసన చేరారు.



ఖరీదైన కళాఖండాలు

సతీష్‌కుమార్ తయారు చేసే కాగితపు శిల్పాలు ఎంతో ఖరీదైనవి. తన ఆలోచనలకు అనుగుణంగా కాగితపు శిల్పాలు తయారుచేయడానికి 50 నుంచి ఐదు వేల గంటల సమయం కూడా పడుతుందని చెబుతున్నాడు. వీటిని కొనుగోలు చేయడానికి విదేశీయులు ఆసక్తి చూపుతుంటారు. సతీష్‌కుమార్ తయారుచేసిన ఓ కాగితపు శిల్పాన్ని రూ.12 లక్షలకు అమెరికాలోని ఓ ప్రవాసాంధ్రుడు కొనుగోలు చేశాడంటే వాటి విలువను అర్థం చేసుకోవచ్చు. చాలామంది తమకు కావల్సిన రీతిలో శిల్పాలు తయారు చేయించుకుని బహుమతులుగా ఇస్తున్నారు. నగరానికి చెందిన కొందరు బీజేపీ నేతలు ప్రధాని మోదీకి ఆయన ముఖచిత్రంతో కూడిన కాగితపు శిల్పాన్ని తయారు చేయించి బహుమతిగా అందజేశారు. సినీ నటి సమంత ఆమెలా ఉన్న కాగితపు శిల్పాన్ని రూ.1.5 లక్షలకు కొనుగోలు చేసింది.

వీటి నాణ్యత ఎక్కువే...

సాధారణ కాగితంతో చేసే బొమ్మలు ఎక్కువ కాలం ఉండవు. కానీ ఎక్కువ కాలం మన్నడానికి ఫ్రాన్స్ నుంచి ప్రత్యేకమైన కాగితపు చార్ట్‌లను దిగుమతి చేసుకుని వాటితో శిల్పాలు తయారుచేస్తుంటారు. ఈ చార్ట్‌లతో తయారు చేసే శిల్పాలు సుమారు 200 సంవత్సరాలు ఉంటాయని సతీష్‌కుమార్ చెబుతున్నాడు.



ఫొటో ఫ్రేమ్‌తో మరింత అందం

ఈ కాగితపు శిల్పాలను ఫొటో ఫ్రేమింగ్ చేస్తే దాని అందం రెట్టింపవుతుంది. శిల్పానికి తగిన ఫ్రేమ్, బ్యాక్‌గ్రౌండ్ ఉంచి వాటిలో ఎల్‌ఈడీలు అమరిస్తే శిల్పం చూడముచ్చటగా తయారవుతుందంటున్నారు. - గోపాలపట్నం-ఆంధ్రజ్యోతి

సైబర్ నేరాలపై అవగాహన

విశాఖపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) తూర్పు నావికాదళంలో సైబర్ సెక్యూరిటీ అంశంపై బుధవారం అవగాహనా సదస్సు జరిగింది. వెబినార్ సహకారంతో సైబర్ పీస్ ఫౌండేషన్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. నేవల్ అధికారులు, సిబ్బంది. కుటుంబ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'క' చిత్రం అందరినీ అలరిస్తుంది

» కథానాయకుడు కిరణ్ అబ్బవరం



డాబాగార్డెన్స్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): క చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుందని హీరో కిరణ్ అబ్బవరం అన్నారు. బుధవారం డాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో చిత్ర యూనిట్ ప్రమోషన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను తొలిసారిగా పాన్ ఇండియా సినిమాతో అడుగు పెడుతున్నానన్నారు. ఈ నెల 31న చిత్రం విడుదల కానుందన్నారు. ఇది పీరియాడికల్ థ్రిల్లర్ సినిమా అని, అభినవ్ వాసుదేవ్ పాత్ర జర్నీ ఎలా జరిగిందనేది 1977లో బ్యాక్‌డ్రాప్‌లో 'క' కథ నడుస్తుందని చెప్పారు. సినిమా టైటిల్‌గా క ఎందుకు పెట్టామో ముగింపులో తెలుస్తుందన్నారు. కుటుంబ సమేతంగా చూడదగ్గ సినిమా అని, ఇందులో వింటేజ్ లుక్‌తో కొత్త గెటప్‌లో కనిపిస్తానన్నారు. విశాఖ అంటే తనకు సెంటిమెంట్ అని, ఎస్ఆర్‌కల్యాణ మండపం స్టోరీ ఆర్కేబీచ్‌లో కూర్చుని రాసుకున్న రోజులు మరిచిపోలేనన్నారు.

నీతి ఆయోగ్ సమావేశానికి వీఎంఆర్‌డీఏ అధికారులు



నీతి ఆయోగ్ సమావేశానికి హాజరైన అధికారులు

విశాఖపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరుగుతున్న నీతి ఆయోగ్ సమావేశానికి వీఎంఆర్‌డీఏ తరపున జాయింట్ కమిషనర్ కె.రమేశ్, ప్లానింగ్ ఆఫీసర్ కిశోర్ బుధవారం హాజరయ్యారు. విశాఖపట్నం కేంద్రంగా ఉత్తరాంధ్రతో పాటు ఉభయ గోదావరి జిల్లాల అభివృద్ధికి రీజనల్ గ్రోత్ ప్లాన్ తయారు చేస్తున్న సంగతి తెలిసిందే. దీనికి సంబంధించిన అధ్యయన నివేదికను త్వరగా ఇవ్వాలని నీతి ఆయోగ్ కమిటీ ఇటీవల విశాఖ పర్యటనలో కోరిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఢిల్లీ సమావేశానికి అధికారులు హాజరై వివరాలు సమర్పించారు.

సందడిగా నాటక బంధు పుస్తకావిష్కరణ



నగరానికి చెందిన పాత్రికేయుడు, కాలమిస్టు బీవీ అప్పారావు రాసిన నాటక బంధు పుస్తకాన్ని బుధవారం పౌరగ్రంథాలయంలో విశ్రాంత డీజీపీ అత్తిలి సుధాకర్ ఆవిష్కరించారు. చిత్రంలో చిత్రంలో మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్, నటుడు చలసాని కృష్ణప్రసాద్, సీనియర్ పాత్రికేయులు వీవీ రమణమూర్తి, రాజేంద్ర వర్మ, రచయిత బీవీ అప్పారావు తదితరులున్నారు.

చీటీల పేరుతో మోసం చేసిన దంపతులు

తగరపువలస, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): చీటీల పేరుతో మోసం చేసిన దంపతులపై భీమిలి పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. తగరపువలసకు చెందిన వంగపండు రోజా, శ్రీనివాసరావు వద్ద చిప్పాడ గ్రామానికి చెందిన కొసన సత్యవతి చీటీ వేసింది. మరికొందరు మహిళలతో చీటీలు, స్కీమ్‌ల కోసం సుమారు రూ1,35,85,000 కట్టించింది. ఈ దంపతులు చీటీలు పాడుకున్న వారికి డబ్బులు ఇవ్వలేదు స్కీమ్‌లకు సంబంధించి వడ్డీ కూడా చెల్లించలేదు. పలుమార్లు సత్యవతి వారిని అడిగినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సీఐ బి.సుధాకర్ మాట్లాడుతూ చీటీల పేరుతో డబ్బులు వసూలు చేసి మోసం చేసినందుకు సెక్షన్ 420 ప్రకారం దంపతులపై చీటింగ్ కేసు నమోదు చేశామన్నారు. అలాగే 2019లో వచ్చిన ప్లానింగ్ ఇన్ రెగ్యులేటెడ్ డిపాజిట్స్ చట్ట ప్రకారం కూడా కేసు నమోదు చేశామని తెలిపారు. కేసు దర్యాప్తులో ఉందని, అయితే ఎవరినీ అరెస్టు చేయలేదని ఆయన చెప్పారు.

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

» మరొకరికి తీవ్ర గాయాలు



ఘటనా స్థలిలో మృతదేహం, క్షతగాత్రుడు

అక్కిరెడ్డిపాలెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన బుధవారం షీలానగర్-విమానాశ్రయం మధ్య జరిగింది. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాక హైస్కూల్ రోడ్డులోని జోగవానిపాలేనికి చెందిన ఏదురు వెంకటేశ్ నవరాత్రి ఉత్సవాలను నిర్వహించాడు. బుధవారం అన్న సమారాధన చేపట్టడంతో అతడి మావయ్య పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడకు చెందిన కొండ్రి వెంకటనాయుడు (54) వచ్చారు. అన్న సమారాధన ముగిశాక మావయ్యను విజయనగరం బస్సు ఎక్కించేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. వీరి వాహనం ఎయిర్‌పోర్టు సమీపంలోని మలుపు వద్దకు వచ్చేసరికి వాహనం హ్యాండిల్ తిప్పే అవకాశం లేకపోవడంతో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. దీంతో ఇద్దరూ కింద పడిపోగా, వెంకటనాయుడు తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. వెంకటేశ్ తీవ్రంగా గాయపడడంతో ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు బలవన్మరణం

నగరంలో బుధవారం వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు వ్యక్తులు బలవన్మరణానికి పాల్పడ్డారు. గాజువాక భానోజీతోటకు చెందిన ఓ వివాహిత, సీతమ్మధార వింధ్య అపార్ట్‌మెంట్‌లో మరో వివాహిత, అక్కయ్యపాలెం నందగిరినగర్‌లో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు.

గాజువాక, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గాజువాక భానోజీతోటకి చెందిన వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. లంక మల్లిక (38) గతంలో ఈవెంట్ మేనేజర్‌గా పనిచేసి ప్రస్తుతం ఖాళీగా ఉంది. ఈమెకు 2005లో రజాక్‌తో వివాహం కాగా, 2010లో విడాకులు తీసుకున్నారు. ప్రస్తుతం మల్లిక తల్లి వద్ద ఉంటోంది. మంగళవారం మల్లిక, తల్లి పిల్లలతో కలిసి గాజువాక వెళ్లి తిరిగి వస్తుండగా జగ్గు జంక్షన్ వద్దకు వచ్చేసరికి ఆమెకు పరిచయం ఉన్న వ్యక్తి గణేష్ నుంచి మెసేజ్ రావడంతో ఆటో దిగిపోయింది. రాత్రి 7.30గంటలకు ఇంటికి చేరుకొని తన గదిలోకి వెళ్లిపోయింది. రాత్రి 9.30గంటల సమయంలో తల్లి పిలిచినప్పటికీ స్పందించకపోవడంతో తలుపు కొట్టింది. స్పందన లేకపోవడంతో కిటికీలోంచి చూడగా ఫ్యాన్ హుక్‌కు ఉరి వేసుకుని కనిపించింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సీతంపేట వింధ్య అపార్టుమెంట్‌లో...

సీతంపేట: స్థానిక వింధ్య అపార్ట్‌మెంట్ ఫ్లాట్ నెంబరు 9లో మోటమర్రి మేధా నాగ్ (33)కు 2020లో మైరెడ్డి శ్రీకాంత్ రెడ్డితో వివాహమైంది. మూడేళ్ల తరువాత శ్రీకాంత్ రెడ్డి ఉద్యోగం కోసం అమెరికా వెళ్లాడు. ఆమె కూడా అక్కడికి వెళ్లేందుకు పత్రాలు సమకూర్చుకుంటోంది. అయితే అనుకున్న సమయానికి పని పూర్తికాకపోవడంతో మనస్తాపం చెందింది. మంగళవారం రాత్రి భోజనం చేసి తన గదిలోకి వెళ్లింది. ఉదయం బయటకు రాకపోవడంతో ఆమె తండ్రి నాగేష్ ఇంటి వెనుక నుంచి చూసే సరికి ఫ్యానుకు చున్నీతో ఉరేసుకుని కనిపించింది. సీఐ విజయ్‌కుమార్ సంఘటన స్థలానికి వెళ్లి విచారణ జరిపి కేసు నమోదు చేశారు. యూఎస్ వెళ్లేందుకు వీసా ఆలస్యం కావడంతో మనస్తాపంతో అఘాయిత్యానికి పాల్పడి ఉంటుందని తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు.

అక్కయ్యపాలెం నందగిరినగర్‌లో...

సీతంపేట: అక్కయ్యపాలెం నందగిరినగర్‌లో ఉంటున్న పొలిశెట్టి సతీష్ (39)మద్యానికి బానిసయ్యాడు. మూడు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మంగళవారం మధ్యాహ్నం భోజనం చేసి ఫోన్ వదిలేసి బయటకు వెళ్లాడు. వారింటి పక్క ఇల్లు అద్దెకోసం రావడంతో సతీష్ భార్య శ్రీదేవి తలుపులు తీయగా ఆ ఇంట్లో సతీష్ ఉరివేసుకుని కనిపించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, సీఐ విజయకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రోన్ హ్యాక్‌థాన్‌లో గీతం వర్సిటీకి అవార్డు



సీఎం చంద్రబాబు నుంచి అవార్డు అందుకుంటున్న గీతం ప్రతినిధులు

సాగర్‌నగర్/ ఎండాడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన డ్రోన్ హ్యాక్‌థాన్ పోటీల్లో గీతం వర్సిటీ ద్వితీయ స్థానంలో నిలిచింది. సుమారు 500 జట్లతో పోటీ పడి గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ జట్టు గెలుపొందింది. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని సెంటర్ ఫర్ అటానమస్ సిస్టమ్స్ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో తయారైన డ్రోన్ టెక్నాలజీని పోటీల్లో ప్రదర్శించినట్టు సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ పి.భరణిచంద్రకుమార్ వెల్లడించారు. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ తృతీయ సంవత్సరం విద్యార్థులు కె.జోశ్య టి.మేఘన, ఈఈసీఐ విభాగం చివరి సంవత్సరం విద్యార్థి సి.సాయిరామ్‌తో కూడిన బృందం డ్రోన్ టెక్నాలజీని రూపొందించారన్నారు. ఈ డ్రోన్ భద్రత విభాగాలకు ఉపయోగకరమన్నారు. విజేతలను ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు బుధవారం అభినందించారు.

ఆక్రమణల తొలగింపుపై మీనమేషాలు

» పీఎం పాలెం మాస్టర్‌ప్లాన్ రోడ్డు ఆక్రమణదారులతో టౌన్‌ప్లానింగ్ అధికారులు కుమ్మక్కు?

విశాఖపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోన్-2 పరిధి పీఎంపాలెం విజేత సూపర్ మార్కెట్ నుంచి సాంకేతిక ఇంజనీరింగ్ కాలేజీకి వెళ్లే మాస్టర్‌ప్లాన్ రోడ్డులో ఆక్రమణలు తొలగింపునకు టౌన్ ప్లానింగ్ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. మాస్టర్‌ప్లాన్ రోడ్డుని ఆక్రమించి ఒకరు ఏకంగా మూడంతస్తుల షాపింగ్‌కాంప్లెక్స్ నిర్మించినా టౌన్‌ప్లానింగ్ అధికారులు కనీసం పట్టించుకోకపోవడం విమర్శలకు దారితీస్తోంది. షాపింగ్‌కాంప్లెక్స్‌కు వచ్చే కొనుగోలుదారులు తమవాహనాలను రోడ్డుపైనే నిలిపేస్తుండడంతో ఆరోడ్డులో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. చాలాసార్లు ప్రమాదాలు కూడా సంభవించడంతో స్థానికులు దీనిపై జోన్-2 టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ఎలాంటి స్పందనలేకపోవడంతో 'ఆంధ్రజ్యోతి' దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఈనెల 22న 'మాస్టర్‌ప్లాన్‌రోడ్డు ఆక్రమణ' శీర్షికన కథనం ప్రచురితమైంది. అయినప్పటికీ అధికారులు పట్టించుకోలేదు. పైగా ఆక్రమణదారులకు సమాచారం ఇచ్చి కొంతమొత్తాన్ని జేబులో వేసుకుని వారితో కుమ్మక్కైనట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై జోన్-2 ఏసీపీ శాస్త్రిని వివరణ కోరగా పనిఒత్తిడి కారణంగా ఆక్రమణలపై దృష్టిపెట్టలేకపోయామని, సంబంధిత వార్డు ప్లానింగ్ సెక్రటరీ పోస్టు ఖాళీగా ఉందని, కొత్త వారు వచ్చి బాధ్యతలు తీసుకున్న తర్వాత దీనిపై సమగ్ర విచారణ జరిపి, ఆక్రమణలపై చర్యలు తీసుకుంటామన్నారు.

డ్రాగన్ బోట్ సాంకేతిక అధికారిగా బలరామ్‌నాయుడు



సాగర్‌నగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): చైనాలో ఈనెల 27 నుంచి జరగనున్న ప్రపంచ కప్ డ్రాగన్‌బోట్ 2024 పోటీలకు సాంకేతిక అధికారిగా రాష్ట్రానికి చెందిన కనోయింగ్ అండ్ కయాకింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.బలరామ్‌నాయుడు ఎంపికయ్యారు. ప్రపంచ వేదికపై ఆయనకు అరుదైన గౌరవం దక్కినట్టు అసోసియేషన్ తెలిపింది. సాంకేతిక అధికారిగా పని చేయడం గౌరవంగా భావిస్తున్నట్టు ఆయన ఇక్కడి విలేకరులకు తెలిపారు.

నడిరోడ్డుపై విద్యార్థుల బాహాబాహీ

మద్దిలపాలెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కృష్ణా కళాశాల రోడ్డులో బుధవారం ఓ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల విద్యార్థులు బాహాబాహీకి దిగారు. ఒకరిపై ఒకరు పిడిగుద్దులు గుద్దుకుంటూ కళాశాల నుంచి రోడ్డు మీదకు పరుగులు పెట్టారు. ఇద్దరు విద్యార్థుల మధ్య మాటామాటా పెరిగి గ్రూపులుగా విడిపోయి కొట్టుకున్నారు. నిలువరించాలని ప్రయత్నించిన విద్యార్థులనూ చితక్కొట్టారు. ప్రయాణికులు, స్థానికులకు ఏం జరుగుతుందో అర్థం కాక విస్తుపోయారు. ఒక్కసారిగా విద్యార్థులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడంతో అక్కడ వాతావరణం ఉద్రిక్తంగా మారింది. ఇంతలో కళాశాల సిబ్బంది వచ్చివిద్యార్థులను విడిపించారు. ఘర్షణలో ఓవిద్యార్థి గాయపడ్డాడు. నడిరోడ్డుపై విద్యార్థులు ఘర్షణకు దిగడంతో ట్రాఫిక్ స్తంభించింది.



కృష్ణా కళాశాల రోడ్డు మీద కొట్టుకుంటున్న విద్యార్థులు